www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00
Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 56 | శుక్రవారం | 9 ఆగస్టు 2024




పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా హాకీలో భారత్ కాంస్యం కాంస్య పతక పోరులో స్పెయిన్‌పై 2-1 తేడాతో విజయం సాధించింది.



3 లో..

## వయనాడ్‌లో 417కు చేరిన మృతుల సంఖ్య

రేపు వరద ప్రాంతాల్లో ప్రధాని పర్యటన

## సాగర్‌కు కొనసాగుతున్న వరద

26 గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పరుగులు

3 లో..



బెంగాల్ మాజీ సీఎం.. కమ్యూనిస్ట్ దిగ్గజం

## బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు శిఖరం బుద్ధదేవ్ భట్టాచార్య (80) తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా శ్వాసకోస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన.. కోల్‌కతాలోని తన నివాసంలో కన్నుమూశారు. గతేడాది న్యుమోనియాతో పాటు పలు అనారోగ్య సమ స్యలు తలెత్తాయి. దీంతో తరుచూ ఆస్పత్రికి వెళ్లి వస్తుండేవారు. అయితే గురువారం నాడు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు లోనైన బుద్ధదేవ్ మృతి చెందారు.

మిగతా 3 లో



# పెట్టుబడుల వేట

## అమెరికాలో సీఎం రేవంత్ చర్చలు ఫలవంతం

- పలు కంపెనీలు పెట్టుబడులకు సిద్ధం
- ఒప్పందాలన్నీ ఖచ్చితంగా తెలంగాణ అభివృద్ధి కోసమే
- నిరాధార వార్తలపై ఐటీ సెక్రటరీ జయేశ రంజన్ వివరణ

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన పెట్టుబడుల న్నీ బోగస్ అంటూ ప్రచారం జరగడాన్ని ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తీవ్రంగా ఖండిరచారు. మొన్న, నిన్న చేసిన కొన్ని పెట్టుబడుల ప్రకటనలు బోగస్ అని వార్తలు వెల్లువెత్తిన నేపథ్యంలో జయేశ్ రంజన్ వీడియో ద్వారా వివరణ ఇచ్చారు. తెలంగాణకు పెట్టుబడులన్నీ వాస్తవమే అని స్పష్టం చేశారు. పెట్టుబడుల కోసం అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అమెరికాలో చేస్తున్న మీంగుల విశ్వసనీయత మీద తెలంగాణ ప్రజలకు ఎటువంటి అనుమానాలు అవసరం లేదని తెలిపారు. అన్ని విషయాలు చెక్ చేసిన తర్వాతే మీటింగ్‌లు చేస్తున్నామని జయేష్ రంజన్ వీడియోలో స్పష్టం చేశారు. ఫైనాన్షియల్ సర్వీసెస్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో తమ సంస్థను నెలకొల్పేందుకు సిద్ధమైంది. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హెూవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్?మెంట్? సెంటర్ ఏర్పాటుపై

మిగతా 2 లో

## యధాతథంగా ద్రవ్య పరపతి విధానం

- రెపోరేటులో మార్పు లేదన్న ఆర్‌బిఐ
- యూపిఐ చెల్లింపుల్లో 5 లక్షల వరకు అనుమతి
- వివరాలు వెల్లడిరచిన గవర్నర్ శక్తికాంత్ దాస్

3 లో..



ఐదుగురు సీనియర్

## ఐపీఎస్‌లకు పదోన్నతులు

డీజీలుగా ప్రమోట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

3 లో..

## బస్సు ఆపనందుకు పాము విసిరిన వృద్ధురాలు

2 లో..

విద్యానగర్‌లో షాకింగ్ ఘటన



మేడిగడ్డ, సుంకిశాల పాపం

## బీఆర్ఎస్‌దే

- లోపభూయిష్టంగా ప్రాజెక్టుల నిర్మాణం
- విద్యుత్ ఉన్నతాధికారులతో భట్టి సమీక్ష
- నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశం

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

మేడిగడ్డ ప్రాజెక్టుతోపాటు సుంకిశాల పాపం కూడా గత భారాస పాలకులదే నని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆరోపించారు. ఆ నెపం వేరొకరి విరీద వేయడం దారుణమని విమర్శించారు. నాసికరమైన కట్టడం, డిజైన్ లోపం కారణంగానే 2021లో భారాస హయాంలో చేపట్టిన సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిందన్నారు. భారాస కాలం నాటి ప్రాజెక్టు డిజైన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆరోపించారు. కూలిపోయే గోడలు కట్టి.. మరొకరిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వర్షాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో భట్టి సవిరీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుంకిశాలపై వార్తల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందని చెప్పారు. మేడిగడ్డ గోదావరి నదిపై మాత్రమే కాదని, కృష్ణానదిని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలిపెట్టలేదని చెప్పారు. సుంకిశాలను బీఆర్ఎస్ నిర్మించిందని చెప్పారు. డిజైన్ లోపం వల్ల సుంకిశాల కూలిందని...దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సుంకిశాల కట్టింది తాము కాదని గత ప్రభుత్వం కట్టిందేనని స్పష్టం

మిగతా 2 లో

## వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంటులో రగడ

బిల్లును వ్యతిరేకించిన ఇండియా కూటమి

అంగీకరించేది లేదన్న ఎంఐఎం

జెసిసికి పంపుతున్నట్లు మంత్రి కిరణ్ రిజు వెల్లడి



**న్యూఢిల్లీ:**

వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు తెచ్చే దిశగా రూపొందించిన సవరణ బిల్లు గురువారం లోక్‌సభ ముందుకొచ్చింది. దీనిపై విపక్షాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీని పంపుతామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడిరచారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కిరణ్ రిజిజు గురువారం దీన్ని లోక్‌సభలో ప్రవేశపె ట్టారు. అనంతరం దీనిపై సభలో చర్చ ప్రారంభించారు.

మిగతా 2 లో

తెలంగాణలో రెండురోజుల పాటు

## తేలికపాటి వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, ప్రజానావ:**

తెలంగాణలో రెండురోజుల పాటు అక్కడక్కడ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను ప్రకటించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోద్కెంది. మెదక్, మహబూబాబాద్, కొత్తగూడెం, ఖమ్మంలో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారంలో 13.6 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. సదాశివునిపల్లిలో 8.6లో, సత్తుపల్లిలో 7 సెంటీమీటర్ల వర్షం కురిసింది.




## జీఎస్టీ కుంభకోణంలో సీఐడీ దూకుడు

- మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ తదితరులకు నోటీసులు
- రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం

**హైదరాబాద్, ప్రజానావ:** జీఎస్టీ కుంభకోణంలో సీఐడీ అధికారులు దూకుడు పెంచారు. జిఎస్‌టి కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌తో పాటు ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరికి నోటీసులు ఇచ్చేందుకు సీఐడీ అధికారులు సిద్ధమవుతున్నారు. కొద్ది రోజుల్లోనే వీరికి నోటీసులు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

మిగతా 2 లో

# మేడిగడ్డ, సుంకిశాల పాపం బీఆర్ఎస్‌దే

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. గోదావరి మేడిగడ్డతో పాటు సుంకిశాల పాపం కేసీఆర్ ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పారు. 2021లో మొదలు 2023 జూల్కెలో సుంకిశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ పాపాలను తమపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ÷ర్ అయ్యారు. పాపాలను భరించలేక ఇప్పటికే ప్రజలు కేసీఆర్ ప్రభుత్వనికి బుద్ధి చెప్పారని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పదోన్నతులపై ఉద్యోగులతో చర్చిస్తామని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ అధికారులకు భట్టి విక్రమార్క అదేశించారు. వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధింత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అంతర్జాతీయ పెట్టుబడులను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరాపై దిశానిర్దేశం చేశారు. ఎస్పీడీసీఎల్‌లో అంతర్గత బదిలీలు, ప్రమోషన్లపై కూడా ఆదేశాలు జారీ చేశామని అన్నారు. విద్యుత్ సరఫరాకు ఏద్కెనా ఇబ్బంది అయితే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల కోసమే నిరంతరం ఎస్పీడీసీఎల్ పనిచేస్తోందని మర్చిపోవద్దని అన్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంటులో రగడ

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా విపక్ష నేతలు మాట్లాడుతూ కేంద్రంపై ధ్వజమెత్తారు. ఈ బిల్లు రాజ్యాంగ స్పూర్తికి విరుద్ధమని, మతపరమైన విభజనకు దారితీస్తుందని కాంగ్రెస్ దీన్ని ఖండిరచింది. ముస్లింల హక్కుల్ని లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని తాము అంగీకరించేదే లేదని విపక్ష నేతలు భగ్గుమన్నారు. అయితే, విపక్షాల ఆరోపణలను కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. సచార్ కమిటీ నివేదిక మేరకు బిల్లును రూపొందించాం. బిల్లుపై దేశవ్యాప్తంగా సంప్రదింపులు జరిపాం. దీని వల్ల మతపరమైన స్వేచ్ఛకు ఆటంకం ఉండదు. ఇతరుల హక్కులను హరిస్తుందనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఇప్పటివరకు హక్కులు పొందని వారికి దీంతో ప్రయోజనం చేకూరుతుంది. వక్ఫ్ బోర్డులను మాఫియా ఆక్రమించిందని చాలా మంది ఎంపీలు చెప్పారు. కొందరు ఎంపీలు వ్యక్తిగతంగా ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కొన్ని పార్టీలు సిద్ధాంతపరంగా మద్దతు ఇవ్వలేమని చెప్పాయి. వక్ఫ్ బోర్డులో వివిధ మతాల సభ్యులుండాలని మేం చెప్పట్లేదు. పార్లమెంట్ సభ్యుడు మాత్రం బోర్డులో ఉండాలంటున్నాం అని కేంద్రమంత్రి వివరించారు. అయితే, విపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నట్లు రిజిజు వెల్లడిరచారు. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసే విధంగా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈ మేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. కొత్త బిల్లు అమలులోకి వస్తే జిల్లా కలెక్టర్లు రూపొందించిన వాస్తవ అంచనా విలువల మేర వక్ఫ్ బోర్డులు తమ ఆస్తులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భాజపా సర్కారు ఎప్పట్నుంచో ఈ సవరణల గురించి ఆలోచిస్తోందని, ఇది సరైన నిర్ణయం కాదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇదివరకే ఈ బిల్లును వ్యతిరేకించింది. ఈక్రమంలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై పార్లమెంట్ లో చర్చ సందర్భంగా రచ్చ రచ్చ అయింది. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రతిపక్ష ఇండియా కూటమి వ్యతిరేకించింది. వక్ఫ్ బోర్డులో కేంద్రం జోక్యంపై ఎంఐఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేంద్రం చేసిన సవరణలను ఇండియా కూటమి సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో వక్ఫ్ బోర్డును బిల్లును జేపీసీకి అప్పగించింది కేంద్రం. వక్ఫ్ (సవరణ) బిల్లు 2024 ఆస్తి నిర్వహణపై వక్ఫ్ బోర్డుల అధికారాన్ని పరిమితం చేయడం, ప్రభుత్వ పర్యవేక్షణను పెంచడం ఈ సవరణ బిల్లు లక్ష్యం. మూల్యాంకనం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వక్ఫ్ ఆస్తులను తప్పనిసరిగా నమోదు చేయాలి. చట్టం ప్రారంభానికి ముందు లేదా తర్వాత వక్ఫ్ ఆస్తులుగా గుర్తించిన ప్రభుత్వ ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగా పరిగణించబడవు. జిల్లా కలెక్టర్ ఆస్తి వక్ఫ్ లేదా ప్రభుత్వ భూమి అని నిర్ణయిస్తారు, వారి నిర్ణయం అంతిమంగా ఉంటుంది. కలెక్టర్ రెవెన్యూ రికార్డులను అప్‌డేట్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారు. కలెక్టర్ నివేదిక అందే వరకు వక్ఫ్ ఆస్తులను గుర్తించరు. వక్ఫ్ బోర్డు నిర్ణయాలకు సంబంధించిన వివాదాలు ఇప్పుడు హైకోర్టులను ఆశ్రయించవచ్చు. మౌఖిక ప్రకటనల ఆధారంగా ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించే నిబంధనలను బిల్లు తొలగిస్తుంది. కంట్రోలర్, ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా లేదా నియమించబడిన అధికారులచే నియమించబడిన ఆడిటర్లచే వక్ఫ్ ఆస్తుల ఆడిట్‌లను ఆదేశించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర బోర్డులలో మహిళా ప్రాతినిధ్యం ఉండేలా సవరణలు కూడా కోరుతున్నాయి. 1995 నాటి వక్ఫ్ బోర్డుల చట్టానికి కేందప్రభుత్వం ప్రతిపాదించిన మార్పులు రాజకీయ చర్చకు దారితీశాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 ప్రకారం ముస్లిం సమాజం వారి భూమి, ఆస్తులు , మతపరమైన వ్యవహారాలను నిర్వహించే స్వేచ్ఛ నుండి తొలగించడానికి ఈ సవరణలు తీసుకొస్తున్నా రని అని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వక్ఫ్ బోర్డులను నియంత్రించాల్సిన అవసరం ఉందని ముస్లిం సమాజమే కోరుకుం టుందని అధికార ఎన్‌డిఎ వాదిస్తోంది. వక్ఫ్ ఆస్తి అనేది ఒక దస్తావేజు ద్వారా దేవుని పేరు విరీద ధార్మిక ప్రయోజనాల కోసం అంకితం చేయబడిన స్థిరాస్తులను సూచిస్తుంది. ఇది అధికారిక డాక్యుమెంటేషన్‌కు ముందు నాటిది కావడంతో చాలా కాలం పాటు ఉపయోగించిన ఆస్తులను కూడా వక్ఫ్ ఆస్తులుగా పరిగ ణించవచ్చు. ఈ ఆస్తులు పబ్లిక్ ధార్మిక ప్రయో జనాల కోసం లేదా ఒక వ్యక్తి వారసులకు ప్రైవేట్ ప్రయోజనం కోసం కేటాయించబడ తాయి. వక్ఫ్ ఆస్తులు బదిలీ చేయబడవు. భగవంతుని పేరు విరీద శాశ్వ తంగా ఉంచబడతాయి. ఆదాయం సాధారణం గా విద్యాసంస్థలు, శ్మశానవాటికలు, మసీదులు, ఆశ్రయాలకు నిధులు సమకూరుస్తుంది. అనేక మంది ముస్లింలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

# కండక్టర్‌ను అకారణంగా తొలగించలేదు

## ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాం

## జనగామ కండక్టర్ వ్యవహారంపై సజ్జన్నార్ వివరణ

**హైదరాబాద్, ప్రజానావ:** జనగామ డిపోకి చెందిన ఒక కండక్టర్‌ను అకారణంగా విధుల నుంచి తప్పించారని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని... ఇది పూర్తి అవాస్తవమని టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. అసలేం జరిగిందంటే.. ఈ నెల 1వ తేదీన ఒక మహిళ, తన తల్లి, ఏడాది కుమారుడితో కలిసి హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు జనగామ డిపోకి చెందిన బస్సు ఎక్కారు. వీరంతా మొదటి వరసలో ఉన్న మహిళా రిజర్వ్‌డ్ సీట్లలో కూర్చున్నారు. ఆ సమయంలో ఆ సీట్లను ఖాళీ చేయాలంటూ కండక్టర్ శంకర్ వారితో అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించారు. లేకుంటే బస్సు దిగి వెళ్లిపోవాలని చెప్పారు. తన అమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారని చెప్పినా వినకుండా.. ముగ్గురిని మడికొండ వద్ద బస్సులోంచి దింపేశారు. ఈ విషయాన్ని బాధిత మహిళా ప్రయాణికురాలి భర్త సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ ద్వారా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సంబంధించిన వివరాలతో పాటు బస్సు, డ్రైవర్, కండక్టర్ ఫొటోలను సైతం షేర్ చేశారు. ఈ ఘటనపై యాజమాన్యం విచారణకు ఆదేశించింది. ఈ ఆదేశాలతో ఆర్టీసీ వరంగల్ రీజియన్ అధికారులు విచారణ జరిపారు. ఈ విచారణలో మహిళా ప్రయాణికురాలి పట్ల దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించడం, నిబంధనలకు విరుద్ధంగా మార్గమధ్యంలో బస్సులోంచి వారిని దించినట్లు తేలడంతో కండక్టర్ శంకర్‌ను విధుల నుంచి తప్పించడం జరిగింది. టీజీఎస్ ఆర్టీసీ నియమ నిబంధనల మేరకే కండక్టర్‌పై శాఖపరమైన చర్యలను సంస్థ తీసుకుంది. గతంలోనూ శంకర్‌పై ఇలాంటి ఫిర్యాదులే వచ్చాయి. దీంతో రెండు సార్లు సస్పెండ్ చేయడంతో పాటు ఒకసారి ఆయనను విధుల నుంచి తొలగించడం జరిగింది. అంతేకాదు, అధికారులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా వేర్వేరుగా ఐదుసార్లు మూడున్నరేళ్ల పాటు విధులకు గైర్హాజరు అయ్యారు. మె- ౦త్తంగా 12 సార్లు శంకర్‌పై ఫిర్యాదులు వచ్చాయని సజ్జనార్ వెల్లడించారు. అయినా మానవత దృక్పథంతో సంస్థ ఆయనకు పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. తాజాగా మళ్లీ ఫిర్యాదు రావడంతో విచారణ జరిపి గతంలో మాదిరిగానే శాఖపరమైన చర్యలను సంస్థ తీసుకుందన్నారు. ఫిర్యాదుల విషయంలో నిబంధనల ప్రకారమే యాజమాన్యం నడుచుకుంటోందని స్పష్టం చేశారు. అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందని సజ్జనార్ తెలిపారు.

# అమెరికాలో పెట్టుబడుల వేట


(మొదటిపేజీ తరువాయి)



కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హావిరీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు స్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది. మరోవైపు అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్.. ఆపిల్ సంస్థ హెడ్ క్వార్టర్ ఆపిల్ పార్క్ వెళ్లనున్నారు. ఆపిల్ మ్యానిఫాక్చర్ టీమ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ కానున్నారు. ట్రినేట్ కంపెనీ సీఈఓతో చర్చించనున్నారు. ఆరమ్ గ్రూప్ ఆఫ్ కంపెనీతో భేటీ అయి హైదారాబాద్‌లో ఆ కంపెనీ డేటా సెంటర్స్ విస్తరణ కోసం చర్చలు నిర్వహించనున్నారు. పలువురు టెక్ కంపెనీల ప్రతినిధులతో లంచ్ విరీటింగ్‌లో పాల్గొననున్నారు. అంగెన్ సంస్థ సీనియర్ లీడర్‌షిప్‌తో పెట్టుబడులపై చర్చలు నిర్వహించ నున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాల సంస్థ రెనెశాస్ తో, మ్యానిఫాక్చర్ సంస్థ అమాట్‌తో ఇన్వెస్ట్‌మెంట్‌పై చర్చలు నిర్వహించనున్నారు. పలు బిజినెస్ సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశంలో రేవంత్ పాల్గొననున్నారు. అలాగే బుధవారం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో చర్చలు సఫలం కానున్నాయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, స్కిల్ యూనివర్సిటీ, ప్రజారోగ్య రంగాల్లో సహకారం అందించడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీకి నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో 400 కోట్లు పెట్టుబడితో ఇన్జెక్టబుల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించేలా వివింట్ సంస్థ కృషి చేస్తామని తెలిపింది. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్ డెవలప్మెంట్ కోసం కార్నింగ్ కంపెనీ సహకరిస్తామని తెలిపింది. అంకాలజీ, క్రిటికల్ కేర్ విభాగంలో సహకారం కోసం కార్నింగ్ కంపెనీతో తెలంగాణ సర్కార్ ఎంఓయూ కుదుర్చుకుంది.

# జీఎస్టీ కుంభకోణంలో సీఐడీ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)



మొదట ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు చేపట్టారు. కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ కేసును సిఐడికి అప్పగించింది. సిసిఎస్ నుంచి ఎఫ్ఐఆర్ ఆధారంగా కేసు నమోదు చేసిన సిఐడి అధికారులు దర్యాప్తును ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సిఐడి అధికారులకు కీలక సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం మేరకే మాజీ సిఎస్ సోమేశ్ కుమార్ సహా నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్వీస్ టాక్స్ అదనపు కమిషనర్ ఎస్‌వి కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరామ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్ బాబు, ప్లియాంటో టెక్నాలజీస్ కంపెనీ నిర్వాహకులకు నోటీసులు అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. స్పెషల్ ఇనిషియేటివ్స్ వాట్సాప్ గ్రూపు ద్వారా సోమేశ్ కుమార్ సర్వీస్ టాక్స్ అధికారులు విశ్వేశ్వరరావు, శివరామ ప్రసాద్, శోభన్ బాబులకు ఆదేశాలు ఇచ్చినట్లు సిఐడి అధికారులు ఆధారాలను సేకరించినట్లు చెబుతున్నారు. కమర్షియల్ టాక్స్ సెంట్రల్ కంప్యూటర్ వింగ్ జాయింట్ డైరెక్టర్ రవి కనూరి అందించిన ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా దర్యాప్తును సిఐడి అధికారులు చేపట్టారు. ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ చెల్లింపుల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ సహా 75 కంపెనీలకు లబ్ధి చేసినట్లు ఆధారాలను సేకరించారు. ఈ కుంభకోణంతో ప్రభుత్వ ఖజానాకు సుమారు 1000 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు సిఐడి అధికారులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. సిఐడి దర్యాప్తు ముమ్మరం అయితే కీలక అంశాలు వెలు గులోకి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ కేసును సిఐడి అధికారులు ప్రత్యేకంగా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ ప్రభు త్వం కూడా ఈ కేసుపై సీరియస్ గానే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దలు ఈ కేసు విషయంలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసు కుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లేలా చేశారని ప్రభుత్వం భావించిన నేపథ్యంలోనే దీనిపై విచారణ చేపట్టింది. వీలైనంత వేగంగా విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్న నేపథ్యంలో సిఐడి అధికారు లు దూకుడు పెంచారు. కొద్దిరోజుల్లోనే నోటీసులు అందించి వారిని విచారించేందుకు సిఐడి అధికారులు సిద్ధమవుతున్నారు. సదరు అధికారుల ను విచారించిన తర్వాత కీలక అంశాలు బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

# రాష్ట్రంలో త్వరగా హైవేల నిర్మాణం

**• లోక్‌సభలో ప్రస్తావించిన ఎంపి ఈటెల • హామీ ఇచ్చిన మంత్రి నితిన్ గడ్కరీ**

**న్యూఢిల్లీ:** నేషనల్ హైవేలను త్వరగా పూర్తి చేయాలని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నాడు పార్లమెంటులో పలు కీలక విషయాలపై ఈటల మాట్లాడారు. తెలంగాణలో 1947 నుంచి 2004 లోపు ఎన్ని కిలోమీటర్ల నేషనల్ హైవేలు నిర్మాణం అయ్యాయో.. గత పదేళ్లలో అంతకంటే ఎక్కువ కిలోమీటర్ల హైవేలు నిర్మాణం అయ్యాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్, హైదరాబాద్ నుంచి నాగపూర్ జాతీయ రహదారులు నిర్మాణం అయ్యాయని తెలిపారు. కానీ హైదరాబాద్ సిటీ లోపల ట్రాఫిక్ పెరిగిపోవడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగాయని అన్నారు. అందుకోసం అండర్ పాస్, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీకి ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. జోడిమెట్ల చౌరస్తా దగ్గర పది ఇంజనీరింగ్ కాలేజీలకు సంబంధించిన దాదాపు 60 మంది విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మరణించారని వివరించారు. విజయవాడ నేషనల్ హైవేపై రెండు ఓవర్ బ్రిడ్జిలు, అలాగే ఛత్తీస్‌గఢ్ హైవేపై రెండు ఓవర్ బ్రిడ్జిలు, కొంపల్లి నుంచి నాగపూర్ హైవేపై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. ఈ మార్గాల్లో మెట్రో రైలు నిర్మాణం చేయాలనే డిమాండ్ కూడా ఉందని గుర్తుచేశారు. ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి కాబట్టి ఈ రెండిటిని కలిపి కోఆర్డినేట్ చేసుకొని నిర్మాణం చేపడితే తక్కువ ఖర్చు అవుతుందని స్పష్టం చేశారు. మంత్రి నితిన్ గడ్కారీ చాలా క్రియాశీలకంగా స్పందిస్తారని ఈ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఈటల రాజేందర్ కోరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ అడిగిన పలు ప్రశ్నలకు సభలో నితిన్ గడ్కరీ సమాధానం ఇచ్చారు. తెలంగాణ ఎంపీ ఈటల రాజేందర్ ఆ రాష్ట్రానికి చాలా పనులు కావాలని అడిగారని చెప్పారు. హైదరాబాద్ రింగ్ రోడ్ కోసం రూ.70 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ పనులు తాము చేస్తామని చెప్పారని అన్నారు. 50శాతం ల్యాండ్ అక్విజిషన్‌కి సంబంధించిన డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్నారని. అది పూర్తి అవ్వగానే నిర్మాణం చేపడతామని వివరించారు. ఈ విషయంపై ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా కలిసినట్లు తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ హైవే రోడ్డుపై చాలా ప్రమాదాలు అవుతున్నాయని చెప్పారు. చాలామంది విద్యార్థులు చనిపోయారని కూడా తమ దృష్టికి వచ్చిందని గుర్తుచేశారు. దీనికి తాము కూడా చింతిస్తున్నామని అన్నారు. ఈ విషయంపై త్వరలోనే ఒక నిర్ణయానికి వస్తామని, మిగతా పనులు త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు.

# రేషన్ కార్డుల జారీ కోసం కేబినేట్ సబ్ కమిటీ

**హైదరాబాద్, ప్రజానావ:** కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీ కోసం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటైంది. పౌరసఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఛైర్మన్‌గా, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశారు. ఇటీవల కేబినెట్ నిర్ణయం మేరకు సీఎస్ శాంతి కుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీకి అర్హతలు, విధివిధానాలను మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేయనుంది. రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. రేషన్ కార్డుల కోసం వార్షికాదాయం, భూపరిమితి తదితర అంశాలపై సబ్ కమిటీ అధ్యయనం చేయనుంది.

# బస్సు ఆపనందుకు పాము విసిరిన వృద్ధురాలు

## విద్యానగర్‌లో షాకింగ్ ఘటన

**హైదరాబాద్, ప్రజానావ:** హైదరాబాద్‌లోని నల్లకుంట విద్యానగర్‌లో షాకింగ్ ఘటన వెలుగుచూసింది. చెయ్యెత్తినా ఆర్టీసీ బస్సును ఆపకపోవడంతో ఓ వృద్ధురాలు తీవ్ర ఆగ్రహంతో బస్సు డ్రైవర్‌పై పామును విసిరింది. నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్ వద్ద ఈ ఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న సదరు వృద్ధురాలు ఆర్టీసీ బస్సు ఆపే ప్రయత్నం చేసింది. అయితే డ్రైవర్ బస్సు ఆపకుండా వెళ్లాడు. ఆగ్రహంతో తన వద్ద ఉన్న బీర్ బాటిల్‌తో బస్సుపై దాడి చేసింది. దీంతో బస్సు వెనుక భాగంలోని అద్దం ధ్వంసమైంది. అది గమనించిన డ్రైవర్ వెంటనే బస్సు ఆపాడు. బీర్ బాటిల్‌తో కొట్టిన ఆమెను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అయితే సీన్ రివర్స్ అయ్యింది. తీవ్ర ఆగ్రహానికి పెద్దావిడ తన వద్ద ఉన్న పాముని బస్సు డ్రైవర్‌పై విసిరింది. భయభ్రాంతులకు గురైన బస్సు డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫిర్యాదు మేరకు నల్లకుంట పోలీసులు రంగంలోకి దిగారు. స్థానికులు ఆమెను పోలీసులకు అప్పగించారు. కాగా డ్రైవర్‌పైకి పాము విసిరిన వృద్ధురాలి బ్యాగులో మరో రెండు పాములు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

# ఐదుగురు సీనియర్ ఐపీఎస్‌లకు పదోన్నతులు

**• డీజీపీలుగా ప్రమోట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్రంలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు లభించాయి. అద నపు డీజీలుగా ఉన్న ఐదుగురు అధికారులను డీజీపీలు గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిం ది. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, ఇంటె లిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డితోపాటు అభిలాష బిస్త్, సౌమ్య మిశ్రా, షికా గోయల్‌ను డీజీపీలుగా ప్రమోట్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీవో విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడ విరీ డ్కెరెక్టర్‌గా అభిలాష బిస్త్, జ్కెళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, సీఐడీ చీఫ్ షికా గోయల్ పనిచేస్తున్నారు. వారు అవే స్థానాల్లో కొనసాగుతారని ఆదేశాల్లో పేర్కొన్నారు.

# రాజ్‌తరుణ్‌కు హైకోర్టులో ఊరట

## ముందస్తు బెయిల్ ఇచ్చిన కోర్టు

**హైదరాబాద్, ప్రజానావ:** టాలీవుడ్ నటుడు రాజ్ తరుణ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. అతడికి తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనను మోసం చేశాడు అంటూ లావణ్య అనే యువతి రాజ్ తరుణ్‌పై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టిన విషయం తెలిసిందే. లావణ్య ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేసి విచారణకు హాజరు కావాల్సిందిగా కోరారు. అయితే దీనిపై రాజ్ తరుణ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అతడికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. అలాగే..
రూ.20వేలతో రెండు పూచికత్తులు సమర్పించాలని ఆదేశించింది. ఇటీవల 'పురుషోత్తముడు' 'తిరగబడరసామీ' అనే సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు రాజ్ తరుణ్. వారం గ్యాప్‌లో వచ్చిన ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచాయి.



### వయనాడ్‌లో 417కు

# చేరిన మృతుల సంఖ్య

**శనివారం వరద ప్రాంతాల్లో ప్రధాని పర్యటన**

**న్యూఢిల్లీ:** ప్రకృతి సృష్టించిన బీభత్సంతో కేరళలో వయనాడ్ జిల్లా ఇప్పుడిప్పుడే తేరుకుం టోంది. అయినా వర్షభయం మాత్రం వున్నా డుతూనే ఉంది. ఈ క్రమంలో బాధిత ప్రజలను ఓదార్చి, విలయాన్ని నేరుగా చూడాలని ప్రధాని మోడీ నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఆయన వయనాడ్ జిల్లాలోని చూరల్మల, ముం డక్క గ్రామాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ 10వ తేదీ న.. శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించ నున్నారు. అలాగే నిరాశ్రయులు తలదాచుకున్న పునరావాస కేంద్రాలను సైతం ఆయన ఈ పర్యటనలో భాగంగా సందర్శించనున్నారు. వయనాడ్‌లో చోటు చేసుకున్న ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన ఎంపీలు విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. పర్యటన అనంతరం ప్రధాని ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తారన్నది ఆస క్తిగా ఎదరు చూస్తున్నారు. వయనాడ్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగి పడడంతో మృతుల సంఖ్య 417కు చేరింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశ ముందని సమాచారం. అలాగే వందలాది మంది గల్లంతయ్యారు. వారి కోసం నేటికి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. 10 వేల మందికి పైగా నిరాశ్రయులు వివిధ పునరా వాస కేంద్రాల్లో తల దాచుకున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ శనివారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కేరళ బయల్దేరి వెళ్తారు. అక్కడ కన్నూర్‌లో ల్యాండ్ అవుతారు. అక్కడి నుంచి కొండచరియలు విరిగిపడిన ప్రాంతానికి వెళ్లి అక్కడి పరిస్థితిని సమీక్షించనున్నారు. అనంతరం ప్రమాద బాధితుల్ని మోదీ పరామ ర్శించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలు గురువారం వెల్లడించాయి. కాగా, వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిం దే. పరిహారం పెంచాలని, సమగ్ర పునరావాస ప్యాకేజీని ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు లోక్‌సభలో కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ వయనాడ్ పర్యటకు ప్రాధాన్యత సంతరించుకుంది. గత నెల 30వ తేదీన భారీ వర్షాల కారణంగా వయనాడ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. ఈ ప్రకృతి విపత్తులో చూరాల్‌మాల్ పట్టణం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. సుమారు 417 మంది ప్రాణాలు కోల్పోయిన ట్లు సమాచారం. వందల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. వారంతా ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 10 వేల మందికిపైగా బాధితులు రిలీఫ్ సెంటర్లలో ఆశ్రయం పొందుతున్నారు. మ-రోవైపు బుధవారం లోక్‌సభలో జీరో అవర్‌లో వయనాడు అంశంపై వాడి వేడి చర్చ జరిగిం ది. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. వయనాడ్ ప్రజలకు నష్ట పరిహారం ప్రకటిం చాలని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విపత్తు సంభవించిన ప్రాంతాల్లో తాను పర్యటించానన్నారు. ఈ విపత్తులో మొత్తం కుటుంబం కుటుంబమే తుడుచు పెట్టుకుని పోయిందన్నారు. ఇక కొన్ని చోట్ల అయితే కుటుంబంలో ఒక్కరు మాత్రమే మిగిలారని చెప్పారు. అదీ కూడా ఇంట్లో పెద్ద వారు లేకుంటే చిన్నారుల్లో ఒక్కరే మిగిలి ఉన్నారని... ఇటువంటి ఘటనలు వయనాడ్ జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీతోపాటు ప్రియాంక గాంధీ ఇటీవల వయనాడ్ జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇటీవల కీలక ప్రకటన చేశారు. భారీ వర్షాలు, వరదలపై కేరళ ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించామని చెప్పారు. కానీ కేరళ ప్రభుత్వం తమ హెచ్చరికలను బేఖాతరు చేసిందన్నారు.

దీనిపై కేరళ సీఎం పినరయి విజయ్ స్పందించారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి హెచ్చరికలు జారీ చేయలేదన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేరళ సీఎం ఖండించారు.

### మంత్రి రామ్మోహన్

# సంతృప్తికర సమాధానం


**అభినందించిన స్పీకర్ ఓం బిర్లా**



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానం ఇచ్చిన యు-వమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును స్పీకర్ ఓం బిర్లా అభినందించారు. మంత్రి సమాధానం సమగ్రంగా ఉందని అన్నారు. తండ్రి ఎర్రన్నాయుడు మరణానంతరం 26 సంవత్సరాలకే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన యువనేత. టీడీపీలో అంచలంచెలుగా ఎదిగారు. వరుసగా మూడుసార్లు శ్రీకాకుళం నుంచి ఎంపీగా ఎన్నికై హ్యాట్రిక్ కొట్టారు. ఎంపీగా ఉంటూ ఏపీలో అనేక సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తారు. ఇప్పుడు కేంద్రమంత్రిగా తనదైన శైలిలో ముందుకు దూసుకెళ్తున్నారు. ఏదైనా అంశంపై రామ్మోహన్ మాట్లాడితే శభాష్ అని.. వారెవ్వా సిక్కోలు సింగం అనకుండా ఉండలేరు. తాజాగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభినందనలు పొందారు రామ్మోహన్. పౌర విమానయాన శాఖకు సంబంధించిన ప్రశ్నలకు.. సభ్యులకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సవివరంగా సమాధానాలు ఇచ్చారు. దీంతో రామ్మోహన్ నాయుడిని స్పీకర్ ఓం బిర్లా అభినందించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సవివరంగా సమాధానం ఇస్తున్నారని స్పీకర్ కితాబిచ్చారు. పౌర విమానయాన శాఖపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు రామ్మోహన్ నాయుడు సమాధానం ఇచ్చారు. దేశంలో ఎంఆర్‌ఓల ఏర్పాటుకు సంబంధించి భాగస్వామ్య పక్షాలు, పరిశ్రమలు, విమానయాన సంస్థలతో ఎలాంటి చర్యలు తీసుకుంది, కొత్తగా ఈ రంగంలోకి వస్తున్న వారికి ఎలాంటి శిక్షణ ఇస్తుందని బీజేపీ సభ్యుడు దుష్యంత్ సింగ్ ప్రశ్నించారు. దీనిపై రామ్మోహన్ సమాధానమిస్తూ.. దేశంలో ఎంఆర్‌ఓల ఏర్పాటుకు తీసుకున్న చర్యలు, సిబ్బందికి శిక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు ఏవిధంగా కృషి చేస్తుందో వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నకు మంచిగా సమాధానం చెపుతున్నారని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు స్పీకర్ ఓం బిర్లా కితాబిచ్చారు.

### బెంగాల్ మాజీ సీఎం కమ్యూనిస్ట్ దిగ్గజం

# బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత




**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు శిఖరం బుద్ధదేవ్ భట్టాచార్య (80) తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా శ్వాసకోస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన.. కోల్‌కతాలోని తన నివాసంలో కన్నుమూశారు. గతేడాది న్యుమోనియా సోకడంపాటు పలు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో తరుచూ ఆస్పత్రికి వెళ్లి వస్తుండేవారు. అయితే గురువారం నాడు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు లోనైన బుద్ధదేవ్ మృతిచెందారు. పెద్దాయన ఇకలేరన్న వార్తతో కుటుంబ సభ్యులు, అభిమానులు, సీపీఎం కార్యకర్తలు, నేతలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కాగా.. భట్టాచార్జీకి భార్య మీరా, కుమారుడు సుచేతన్ ఉన్నారు. మార్చి1, 1944న బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన బుద్ధదేవ్.. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో ఉన్నత చదువులు చదివారు. బెంగాల్ సాహిత్యం చదివిన ఆయన.. ఉపాధ్యాయుడిగా కెరీర్ మొదలుపెట్టారు. ఇక ప్రజాసేవే లక్ష్యంగా 1966 రాజకీయాల్లోకి వచ్చి.. పలు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1968లో జరిగిన వియత్నాం ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. ఈ క్రమం లోనే.. 1968లో యువజన విభాగం అయిన డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రమోద్ దాస్‌గుప్తా.. బుద్ధదేవ్‌కు గురువు అని చెప్పుకుం టూ ఉంటారు. 1977లో కాశీపూర్-బెల్గాచియా నియోజ కవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. మొదటి సారే గెలవడమే కాదు.. సమాచార శాఖా మంత్రిగా పదవి కూడా దక్కించుకున్నారు. 1982లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోసిపూర్ నియోజకవర్గం నుంచి 1982లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత.. 1984లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1987లో జాదవ్‌పూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈసారి కూడా.. మొదటిసారి మాదిరిగానే సమాచార శాఖ మంత్రిగా పనిచేశారు. 1991లో సమాచార శాఖతో పాటు సాంస్కృ తిక వ్యవహారాలు, పట్టణాభివృద్ధి, మునిసిపల్ వ్యవహారాల శాఖలకు మంత్రిగా తన కర్తవ్యాలను నిర్వర్తించారు. అలా పార్టీకి విధేయుడిగా ఉండటంతో పాటు.. పోటీచేసిన నియోజకవర్గానికే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయనపైన అవినీతి ఆరోపణ లు కూడా ఉన్నాయని అప్పట్లో పెద్ద చర్చే జరగడం.. కొన్ని నెలల వ్యవధిలోనే తిరిగి జ్యోతిబసు మంత్రివర్గంలో చేరారు. 1996 ఎన్నికల్లో గెలిచిన తర్వాత జ్యోతిబసుకు అనారోగ్యంతో బాధపడుతుండటంతో నాడు సీనియర్‌గా ఉన్న భట్టాచార్జీకి డిప్యూటీ సీఎం, హోం శాఖ కూడా బాధ్యతలు కూడా అప్పగించారు. 2000లో బసు రాజకీ యాలకు దూరమైన తర్వాత బుద్ధదేవ్ దశ తిరిగింది. ఆ తర్వాత పార్టీకి అన్నీ తానై 2001 ఎన్నికల్లో పార్టీని గెలిపించి.. తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత జరిగిన 2006 అసెంబ్లీ ఎన్నికల్లోనూ సీపీఎం గెలుపులో ప్రధానపాత్ర పోషించారు. దీంతో రెండోసారి సీఎంగా ఎన్నికయ్యారు. అలా.. జ్యోతిబసు తర్వాత ముఖ్యమంత్రి గా మంచి పేరు సంపాదించుకున్న భట్టాచార్జీ.. నాడు తీసుకున్న కొన్ని నిర్ణయాలు, సంస్కరణ లతో పార్టీ ఓట మిని చవిచూసింది. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినప్ప టికీ సాధారణ జీవితాన్నే గడుపుతూ వచ్చారు. బాలీగంజ్‌లోని చిన్న ఇంట్లోనే నివసించడం, సీఎంగా కూడా ఇక్కడ్నుంచే విధులు నిర్వర్తించడం ఈయన ప్రత్యేకత. ఆఖరికి అదే ఇంటిలోనే తుదిశ్వాస కూడా విడిచారు. సాధారణ కార్యకర్తతో మొదలైన ఆయన జీవితం పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యే వరకూ వెళ్లింది. రెండు దఫాలుగా సీఎంగా పనిచేసిన భట్టాచార్జీ రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. జ్యోతిబసు తర్వాత రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు.. జాతీయ రాజకీయాల్లోనూ ఈయన పేరు ఎక్కువగా వినిపించేది. 34 ఏళ్ల పాటు పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్ట్ పాలన సాగగా.. ఇందులో బుద్ధదేవ్ పాత్ర కీలకం. మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణముల్ కాంగ్రెస్ చారిత్రాత్మక విజయం సాధించినప్పుడు 2011 ఎన్నికల్లో భట్టాచార్జీ సీపీఎంకు అన్నీ తానై ముందుకు నడిపించారు. ఈయన హయాంలో జరిగిన సింగూర్ టాటా నానో వివాదం, నందిగ్రామ్ హింస ఎప్పటికీ రాష్ట్ర ప్రజలు మరిచిపోలేరని చెబుతుంటారు. ఇదిలా ఉంటే జనవరి 2022లో నాటి కేంద్ర మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌ను అందించగా.. అవార్డును తిరస్కరించారు. ఆయన మృతకి కమ్యూనిస్ట్ నేతలు సతాపం ప్రకటించారు.

### యధాతథంగా

# ద్రవ్య పరపతి విధానం

- రెపోరేటులో మార్పు లేదన్న ఆర్‌బిఐ
- యూపిఐ చెల్లింపుల్లో 5 లక్షల వరకు అనుమతి
- వివరాలు వెల్లడించిన గవర్నర్ శక్తికాంత్ దాస్



**ముంబై:** విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పులు చేర్పులు చేయ కుండా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిం చింది. పరపతి విధాన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. రెపోరేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కూడా రెపో రేటును ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగిస్తూ వస్తోంది. ఆర్‌బీఐ బెంచ్‌మార్క్ వడ్డీ రేటును యథాతథంగా కొనసాగించడం ఇది 9వ సారి కావడం గమనార్హం. ద్రవ్యోల్బణం, వృద్ధి అనేవి రెండూ కూడా సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. అయినప్పటికీ ఆహార ధరల విషయమంలో అప్రమత్తత అవసరమని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంపీసీ తొలిసారిగా సమావేశమైంది. మొత్తంగా చూస్తే ఇది 50వ సమావేశం. ఈ సమావేశంలో మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురిలో నలుగురు పాలసీ రేటును యథాతథంగా ఉంచాలనే నిర్ణయానికి అనుకూలంగా ఓటు వేశారని శక్తికాంత దాస్ చెప్పారు. ముఖ్యంగా.. సెంట్రల్ బ్యాంక్ నుంచి బ్యాంకులు డబ్బు తీసుకునే రేటు. రెపో రేటు స్థిరంగా ఉండటంతో మన రుణ వాయిదాలో ఎలాంటి మార్పులు చేర్పులు ఉండబోవు. రెపో రేటు తగ్గితే మన హోమ్ లోన్, పర్సనల్ లోన్, కార్ లోన్ వాయిదా తగ్గుతుంది. ఆర్‌బీఐ చివరిసారిగా గతేడాది ఫిబ్రవరిలో రెపో రేటును మార్చింది. ఆ తర్వాత 0.25 శాతం పెరిగి 6.50 శాతానికి చేరుకుంది. ఆహార పదార్థాల ధరలు పెరగడంతో ఏప్రిల్ - మే వరకూ స్థిరంగా ఉన్న ద్రవ్యోల్బణం.. జూన్‌లో మళ్లీ పెరిగింది. 2024-25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం కాగా.. ఒకటి, రెండు, నాలుగో త్రైమాసికంలో 7.2 శాతం, మూడో క్వార్టర్‌లో 7.3 శాతంగా ఉండే అవకాశం. ఆహార ద్రవ్యోల్బణం అనేది నైరుతి రుతుపవనాల కారణంగా దిగొచ్చే అవకాశం ఉంది. 2024-25లో ద్రవ్యోల్బణం 4.5 శాతం.. రెండో త్రైమాసికంలో 4.4శాతం.. మూడో త్రైమాసికంలో 4.7శాతం .. నాలుగో త్రైమాసికంలో 4.3 శాతంగా ఉండవచ్చు. భారత కరెన్సీ రూపాయి మారకం విలువ విషయానికి వస్తే.. పరిమిత శ్రేణిలోనే ఉంది. భారత విదేశీ మారక నిల్వలు ఆగస్టు రెండు నాటికి రికార్డ్ స్థాయి-ంలో 675 బిలియన్ డాలర్లకు చేరవచ్చు. రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకాశాలు ఒకవైపు పెరుగుతుంటే.. బ్యాంకుల డిపాజిట్లు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులు క్రెడిట్ డిమాండ్‌ను అందుకోవ డంలో ఇబ్బంది పడుతున్నాయి. వ్యక్తిగత రుణ వితరణలో గణనీయ వృద్ధిని పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. టాపప్ లోన్లు, బంగారు రుణాలను ఇవ్వడంలో ఆర్థిక సంస్థలు పెద్దగా నిబంధనలను పాటించడం లేదు. ఇలాంటి వాటిని అరి కట్టాలి. ఇక ఆర్బీఐ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా ట్యాక్స్ టాక్స్ పేమెంట్లపై యూపీఐ లిమిట్‌ను పెంచుతూ నిర్ణయం తీసున్నారు. గతంలో రూ. లక్ష రూపాయలు ఉండే యూపీఐ లిమిట్‌ను రూ.5 లక్షలకు పెంచినట్టు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. అంటే ఇప్పుడు యూపీఐ ద్వారా ఒకేసారి రూ. లక్ష వరకూ చెల్లించవచ్చు. కేవలం కొద్ది గంటల్లోనే చెక్ క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ గవర్నర్ ప్రతిపాదించారు. పాత ఇంటి రుణంపై అదనపు రుణం తీసుకుంటున్న తీరుపై శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై ట్యాక్స్ చెల్లించేవారు రూ.5 లక్షల వరకూ ఎలాంటి ఇబ్బందీ లేకుండా యూపీఐతోనే చేయవచ్చు. దీనికి ఎలాంటి అదనపు చార్జీలు వేయరు. చెల్లింపులు డెబిట్ లేదంటే క్రెడిట్ కార్డులతో చేస్తే మాత్రం కొంత చార్జీలు పడతాయి. ఆర్బీఐ ఇలా చార్జీలు పెంచడమనేది కొత్తేమీ కాదు.. గతంలోనూ పలు మార్లు పెంచింది. అంతకుముందు 2023 డిసెంబర్‌లోనే హాస్పిటల్, ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ వంటి వాటికి చేసే యూపీఐ పేమెంట్ లిమిట్‌ను ఆర్బీఐ రూ. 5 లక్షలకు పెంచింది. ప్రస్తుతం పన్ను చెల్లింపుల పరిమితిని కూడా పెంచేసింది. సాధారణ యూపీఐ ట్రాన్సాక్షన్ లిమిట్ విషయంలో మాత్రం మార్పేమీ చేయలేదు. అది గరిష్టంగా రూ. లక్ష మాత్రమే ఉంది.

### ఇక గంటల్లోనే

# చెక్కుల క్లీయరెన్స్

- ప్రక్రియలో మార్పులకు ఆర్‌బిఐ సిద్ధం
- వెల్లడించిన గవర్నర్ శక్తికాంత్ దాస్

**ముంబై :** డిజిటల్ యుగంలోనూ బ్యాంకింగ్ సేవల్లో ఏదైనా ఆలస్యం అవుతోందీ అంటే అది చెక్కు ల క్లియరెన్సే అని చెప్ప తప్పదు. ఎవరైనా తమ పేరు మీద చెక్కు ఇస్తే దాన్ని నగదు రూపంలో మార్చుకోవడానికి ప్రస్తుతం రెండ్రోజుల సమయం పడుతోంది. ఇతర మార్గాల్లో సత్వరమే నగదు లభిస్తు న్న ఈ రోజుల్లో చెక్కులు మాత్రం రోజుల గడువు తీసుకుంటున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దీనిపై దృష్టిసారించింది. కొన్ని గంటల్లోనే చెక్కు క్లియరెన్స్ జరిగేలా సంబంధిత పక్రియలో కీలక మార్పును ప్రకటించింది. ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధా న సమీక్ష నిర్ణయాల వెల్లడి సందర్భంగా చెక్కులకు సంబంధించి ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈ ప్రకటన చేశారు. చెక్కుల క్లియరెన్సుకు ప్రస్తుతం టీ-1 విధానం అమలవుతోందని చెప్పారు. దీన్ని కొన్ని గంటలకు తగ్గించాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రస్తుతం అవలంబిస్తున్న చెక్ ట్రంకేషన్ సిస్టమ్ విధానంలో మార్పులు చేయనున్నారు. బ్యాచ్‌ల వారీగా ప్రాసెసింగ్ కాకుండా.. ఇకపై 'ఆన్ రియలై జేషన్ సెటిల్‌మెంట్' విధానాన్ని అవలంబించనున్నట్లు చెప్పారు. బ్యాంకు పని గంటల్లో చెక్కును స్కాన్ చేసి, ప్రజెంట్ చేసి, కొన్ని గంటల్లోనే పాస్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. దీనివల్ల కొన్ని గంటల్లోనే చెక్కు క్లియరెన్స్ పూర్తవుతుందని పేర్కొన్నారు. దీనికి సంబం ధించి పూర్తి మార్గదర్శకాలను త్వరలో జారీ చేయను న్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. వినియోగదారుల బ్యాంకింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరిచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇక నిరంతర చెక్ క్లియరెన్స్‌ను చేపట్టాలన్నారు.

### సాగర్‌కు కొనసాగుతున్న

# వరద ప్రవాహం

**26 గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పరుగులు**

**నల్లగొండ :** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతున్నది. దీంతో 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. 22 గేట్లు 5 అడుగులు, 4 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడిచిపెడుతున్నారు. సాగర్‌లోకి 2.53 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. 2.69 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగుకాగా ప్రస్తుతం 585.30 అడుగులుగా ఉన్నది. ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ 312.50 టీఎంసీలు కాగా, ఇప్పుడు 298.30 టీఎంసీలుగా నమోదయింది. సాగర్ నుంచి భారీగా వరద వస్తుండటంతో దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు పూర్తిగా నిండింది. జలాశయంలోకి 2.57 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 11 గేట్ల ద్వారా 2.30 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా, ప్రస్తుతం 167.9 అడుగుల వద్ద ఉన్నది. 45.77 టీఎంసీలకుగాను 35.50 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



## పేటలో పంచాయతీ కార్మికుల సమ్మె


**పెద్ద శంకరంపేట, ప్రజానావ:** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు పెద్ద శంకరంపేటలో గురువారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పేట పంచాయతీ కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పి రాములు, వివేక్, భూమయ్య, చాకలి రాములు, మానయ్య, లచ్చుమ్మ, సాయమ్మ, సుశీల, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## కట్ట మైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట



**ఆమనగల్లు, ప్రజానావ:** ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు కట్ట పైన వెలసిన కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, శ్రీ నారాయణి ప్రత్యంగిరాదేవి మహా యజ్ఞం సంబంధించిన కార్యక్రమాల కరపత్రాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో మొక్తాల వెంకటయ్య, తల్లోజు వెంకటయ్య, మొక్తాల అంజయ్య, తట్టేపల్లి వెంకటయ్య, ఎర్రవోలు రాజు, ఎర్రవోలు శ్రీను కెకె, ఎర్రవోలు మహేష్, బొల్లు శివ, గంజి వెంకటయ్య, యాట మల్లేష్, మొక్తాల చిన్నా వెంకటయ్య, బోల్లు రమేష్, ఎం. మహేష్, శ్రీశైలం, నరేష్, ఊరటి వెంకటయ్య, మొక్తాల సాయి తదితరులున్నారు.

### రాడార్ స్టేషన్ నిర్వహణ నిర్ణయాన్ని
## ఉపసంహరించుకోవాలి



**వికారాబాద్, ప్రజానావ:** రాడార్ స్టేషన్ నిర్వహణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీ.ఓ.డబ్ల్యు జిల్లా కన్వీనర్ వై గీత, ఏ.ఐ.కె.ఎమ్.ఎస్ జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవిలో 2900 ఎకరాల భూమిని రాడార్ స్టేషన్ వీ.ఎల్.ఎఫ్ నిర్మాణానికి కేటాయించడం జరిగిందని, ఈ అడవిలో 12 లక్షల చెట్లను తొలగించడానికి జరుగుతున్న ప్రయత్నాలు వెంటనే రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చెట్లను నాటాలని పిలుపునివ్వడం సంతోషకరం కానీ ప్రాజెక్టుల పేరుతో అనేక ఔషధ గుణాలు కలిగిన 12 లక్షల చెట్లను తొలగించడం కోసం తీసుకున్న నిర్ణయం చాలా బాధాకరం అని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అదేవిధంగా వీ.ఎల్.ఎఫ్ వల్ల 60 నుండి 70 కిలోమీటర్ల దూరంలో రేడియేషన్ ప్రభావం ఉండటం చేత వికారాబాద్ జిల్లా భవిష్యత్తు ప్రమాదంలో పడనుందని అన్నారు. ఈ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు ఇచ్చిన అనుమతులను అన్నింటిని రద్దు చేసి దామగుండం అడవిని కాపాడగలరని కోరారు. ఈ కార్యక్రమంలో దామగుండం అడవి నివాసి సత్యానంద స్వామి, ఏఐకెఎమ్ఎస్ నాయకులు రాము లు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, పీఓడబ్ల్యు నాయకులు ప్రభావతి పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో
## వన మహోత్సవం



**ఆత్మకూర్ (ఎం), ప్రజానావ:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు మండల స్పెషల్ ఆఫీసర్ రాజారాం, ఎంపీడీఓ రాములు నాయక్ పాల్గొని ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో పచ్చదనం - స్వచ్ఛదనం కార్యక్రమంలో వన మహోత్సవ పనులను పరిశీలించి ఫిట్టింగ్ ప్లాంటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, సీహెచ్ఓ కరుణాకర్, హెల్త్ సూపర్వైజర్ సాంబులమ్మ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఉపాధి హామీ ఏపీఓ బొడిగ రమేష్, టీఏ యాదిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి తుమ్మల ఆనంద్ కుమార్, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశాకార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి రవాణా ముఠా అరెస్ట్



**కాటారం, ప్రజానావ:** నిషేధిత గంజాయి రవాణాకు పాల్పడుతున్న ముఠాను కాటారం పోలీసులు అరెస్ట్ చేశారు. కాటారం పోలీస్ స్టేషన్ లో ఇంచార్జ్ సీఐ రామచందర్ రావు తెలిపిన వివరాల ప్రకారం కాటారం పోలీస్ లకు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు కొందరు వ్యక్తులు అక్రమంగా నిషేధిత గంజాయి రవాణా చేస్తున్నట్టు సమాచారం రాగ కాటారం ఎస్ఐ మ్యాక అభినవ్, సిబ్బందితో కాటారం మండలంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపంలో మాటు వేసి గంజాయి రవాణాకు పాల్పడుతున్న కాటారం చెందిన దుర్గం నంద కిషోర్ (23), బయ్యారంకు చెందిన జగజంప్పుల విష్ణు (23), కొత్తపల్లికి చెందిన పెద్ది నిఖిల్ రాజ్(19), కాటారం చెందిన కడారి కార్తీక్ (20), మారుపాక రిశ్వంత్ (21), మెరిజాల రోహిత్ (20), ఎర్రగుంటపల్లికి చెందిన జక్కు రాజేష్ (23) అనే వ్యక్తులకు దుర్గం నంద కిషోర్ తన వెంట తెచ్చిన నిషేధిత గంజాయి ఇస్తుండంగా కాటరం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి దగ్గర నుండి 1.8 కేజీల నిషేధిత గంజాయి పోలీస్ వారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇట్టి నిషేధిత గంజాయిని భూపాలపల్లికి చెందిన లావుద్య సిద్దు అనే వ్యక్తి దగ్గర రూ.36,0000/-లు ఇచ్చి 1.8 కేజీల గంజాయి తీసుకున్నట్లు దుర్గం నంద కిషోర్ విచారణలో ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు వివరించారు. ఇట్టి కార్యక్రమం లో కాటారం ఎస్ఐ అభినవ్, కానిస్టేబుల్స్ లక్ష్మిరాజం, హరికుమార్, జంపన్న, సాంబశివరావు, లవన్, నరేష్, హెూంగార్డు తిరుపతి పాల్గొన్నారు. యువత గంజాయి విక్రాయాలు, రవాణా లాంటి వాటికి పాల్పడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఇంచార్జ్ సీఐ రాంచందర్ రావు, ఎస్ఐ మ్యాక అభినవ్ తెలిపారు. యువత గంజాయికి దూరంగా వుండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక పై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. యువత గొడవల జోలికి వెల్లి అనవసరంగా కేసుల పాలై జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. శాంతి భద్రతలకు విఘతం కలిగేలా వ్యవహారిస్తే కేసులతో పాటు రౌడీ షీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వసతి గృహాల్లో శానిటేషన్



**ఆమనగల్లు, ప్రజానావ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛతనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అమంగల్ మున్సిపాలిటీ కమిషనర్ వసంత, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గిరిజన హాస్టల్‌లో ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వివిధ హాస్టల్లో సానిటేషన్ కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రత పట్ల డెంగ్యూ మలేరియా వంటి రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, వైద్యులు, మున్సిపాలిటీ కమిషనర్ వసంత, ఆశ వర్కర్లు అంగన్వాడి కార్యకర్తలు, మున్సిపాలిటీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## నేర నియంత్రణకు మెడికల్ అసోసియేషన్ విరాళం

**ఆమనగల్లు, ప్రజానావ:** ఆమనగల్ పట్టణంలో నేర నియంత్రణకు గాను సీసీ కెమెరాల ఏర్పాటు, పునరుద్ధరణకు తమ వంతు సహాయంగా ఆమనగల్ మండల మెడికల్ అసోసియేషన్ సభ్యులు లక్ష రూపాయల ఆర్థిక సహాయం గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ సీఐ ప్రమోద్ కుమార్, ఎస్సై వెంకటేష్ ను కలిసి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నటరాజ్ యాదయ్య, ఉప్పు రాములు, పాపిశెట్టి అరవింద్, రవీంద్ర, శ్రీనివాస్, శేఖర్, యాదయ్య, గణేష్, సభ్యులు పాల్గొన్నారు.



## ఆరోగ్యం, పరిశుభ్రం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### సీడీఏంపి అడిషనల్ డెరైక్టర్ శ్యామ్సన్

**వికారాబాద్, ప్రజానావ:** విద్యార్థుల ఆరోగ్యం పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీఏంపి అడిషనల్ డెరైక్టర్ శ్యామ్సన్ అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం సీడీఏంపి అడిషనల్ డెరైక్టర్ శ్యామ్సన్ తో కలిసి వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగులపల్లి మంజుల రమేష్ వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు సంఘం లక్ష్మీబాయి పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యం పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అలాగే కుక్కల బెడదపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, స్థానిక నాయకులు వెంకట్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తహశీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్ళుతున్న సర్వేయర్ సమీర్ గురువారం మాజీ జెడ్పీటీసీ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, డిప్యూటీ తహశీల్దార్ తదితరులు సన్మానించారు.
**- ఆత్మకూరు(ఎం), ప్రజానావ**

## ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



**చివ్వేంల, ప్రజానావ:** చివ్వేంల మండలలోని వట్టి ఖమ్మం పహాడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు విమల, శ్రీదేవి, జయశ్రీ ప్రమోషన్ లో బదిలీపై వెళుతున్న సందర్భంగా వట్టి ఖమ్మం పహాడ్ గ్రామ ప్రజలు, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ జంపాల వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు దయానిధి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం జంపాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది చాలా పవిత్రమైనది దీనిని అంకితభావంతో పనిచేస్తున్న వారికి అభినందనలు తెలియజేస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్య కోసం తయారు చేసిన ఉపాధ్యాయులకు సన్మానం చేసుకోవటం ఒక మంచి సాంప్రదాయమని అన్నారు. సుదీర్ఘకాలం గ్రామంలో పనిచేసిన ఉపాధ్యాయులకు గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మశ్రీ, మోహన్ రెడ్డి, రామకృష్ణ నాయక్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



## గత పదేళ్లలో చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం

**న్యూఢిల్లీ:** గత పది సంవత్సరాలుగా చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. హ్యాండ్లూమ్, హస్తకళా జాతీయ సమాఖ్య రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నాడు డిల్లీలోని కాన్స్టిట్యూషనల్ క్లబ్ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి చేనేత, హస్తకళ కార్మికులకు నిర్లక్ష్యం చేయడమే కాక ఈ ఆర్థిక సంవత్సరం కోసం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లోను అన్యాయం చేశారని అన్నారు. అలాగే వారిని పట్టించుకోలేదని, గత 10 ఏళ్లుగా కేటాయింపుల్లో న్యాయం జరగలేదన్నారు. వారి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని సభలో వారి సమస్యల పట్ల కాంగ్రెస్ ఎంపీల తరపున పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేశ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఆయన వెంట గుంజ ఆంజనేయులు తదితరులున్నారు.
– ఖైరతాబాద్, ప్రజానావ

# జూబ్లీహిల్స్ డివిజన్‌లో అక్రమ కట్టడాలను అరికట్టండి

**ఆర్డీఓకు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వినతి**



**ఖైరతాబాద్, ప్రజానావ:** జూబ్లీహిల్స్ డివిజన్ వినాయక నగర్‌లోని పర్వతాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్లను తొలగించడమే కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనూ ఇదేవిధంగా అక్రమ నిర్మాణాలను చేపడితే పోలీసులు కేసు నమోదు చేశారని, అయినా ఈ అక్రమ నిర్మాణాలు ఆగడం లేదన్నారు. ఇక కొందరు కోర్టు నుంచి స్టే ఆర్డర్లు తెచ్చుకుని తిరిగి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఇకపై ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అక్రమ కట్టడం నిర్మించకుండా చూడాలని, మళ్లీ జరిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఫిల్మ్ నగర్‌లో ఎంతోమంది నిరుపేదలు ఏళ్ల తరబడి కిరాయి ఇళ్లల్లో ఉంటున్నారని, వారికి ఇలాంటి ప్రభుత్వ స్థలాల్లో డబల్ బెడ్ రూమ్ లు కట్టించి కేటాయిస్తే పేదలకు మేలు జరుగుతుంది ఆయన అభిప్రాయపడ్డారు.



# బాధిత మహిళలు, చిన్నారులకు 'భరోసా' కల్పించాలి

**ఎస్పీ అఖిల్ మహాజన్**

**సిరిసిల్ల, ప్రజానావ:** భరోసా కేంద్రాలపై బాధిత మహిళలు, చిన్నారులకు అవగాహన కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం పట్టణ కేద్రంలోని భరోసా సెంటర్‌ని ఆయన సందర్శించారు. లైంగిక, భౌతిక దాడులకు గురైన బాధితులకు భరోసా సెంటర్ లో కల్పించే న్యాయ సలహాలు, సైకలాజికల్ కౌన్సెలింగ్, వైద్య పరంగా తీసుకుంటున్న చర్యలు, మహిళల వేధింపులపై నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భరోసా సెంటర్ అందిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ లైంగిక దాడులకు గురైన బాధితులకు సత్వర సేవలు అందించాల్సిన బాధ్యత భరోసా కేంద్రం పై ఉందని, లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కల్పిండంతో పాటు వారికి పూర్తి సహాయ సహకారాలను అందించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా పోక్సో, అత్యాచారం కేసులు జరగగానే సంబంధిత బాధితులను నేరుగా భరోసా సెంటర్ కు అధికారులు తీసుకొని రాగానే చట్ట ప్రకారం వారికి సూచనలు, సలహాలు తక్షణమే అందించాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట టౌన్ సీఐ కృష్ణ, శ్రీనివాస్, ఎస్ఐ జ్యోతి, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ శిల్ప, లీగల్ సపోర్ట్ పర్సన్ అనంత, సపోర్ట్ పర్సన్ స్వభావతి, మల్లీశ్వరి, ఏఎన్ఎం పవణిత ఉన్నారు.



# నిజాం కాలేజ్ యూజీ స్టూడెంట్స్ ధర్నా

**హైదరాబాద్, ప్రజానావ:** నిజాం కాలేజ్ లో ధర్నా చేస్తున్న యూజీ స్టూడెంట్స్ ను కలిసి సమస్యలను ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ తెలుసుకున్నారు. యూజి స్టూడెంట్స్ ఎమ్మెల్సీ తో హాస్టల్ లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. హాస్టల్ మొత్తం తమకే కేటాయించాలనీ యూజి స్టూడెంట్స్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ హాస్టల్ సమస్యలను పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చారు. యూజి–పీజీ స్టూడెంట్స్ కూడా పంథాలకి పోకుండా సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని అన్నారు.



# కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

**కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో (దాదాపు 200మందికి పైగా) గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వీరికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ముదిరాజ్, రజక, కుర్మా, రెడ్డి సంఘ సభ్యులు పార్టీలో చేరినట్లు చెప్పారు. ప్రజల కష్టా సుఖల్లో పలు పంచుకొంటూ ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా పనిచేయాలని వారికి సూచించారు. ఇటీవల ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఫాజుల్ నగర్ ప్రాజెక్టు పూర్తయిందన్నారు.



# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా అల్మాస్‌పుర్‌లో పర్యటన

**ఎల్లారెడ్డిపేట, ప్రజానావ:** సీజనల్ వ్యాధుల నియంత్రణ పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. స్వచ్ఛదానం.హాపచ్ఛదనంలో భాగంగా నాలుగో రోజు ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్ పూర్ లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల బాధ్యులు, ఆశాలు, పాఠశాల సమావేశాల్లో డెంగ్యూ, మలేరియాపై అవగాహన కల్పించాలని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు సర్వేలు నిర్వహించాలని ఆదేశించారు. ఏదైనా ప్రాంతంలో జ్వరాలు బయటపడితే ఇంటెన్సివ్ క్లీనింగ్, యాంటీలార్వాల్, ఫాగింగ్ చర్యలు అట్టి ఏరియాలో చేపట్టాలని, దోమలను నిరోధించే ఆయిల్ బాల్ తగినంత సంఖ్యలో తయారుచేసుకొని, వాటిని నీరు నిల్వ ప్రదేశాల్లో విడుదల చేయాలని వివరించారు. యాంటీ–లార్వా రసాయనాలు పిచికారీ చేయాలని, ఫాగింగ్ (మలాథియాన్) ప్రతిరోజూ చేయాలని సూచించారు. పట్టణ, స్థానిక సంస్థలలో జంతు జనన నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, పశుసంవర్ధక శాఖ వారి సమన్వయంతో వీధి కుక్కల సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాం చందర్, వైద్య, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ కార్యాలయం తనిఖీ**

ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ధరణి దరఖాస్తులు పెండింగ్లో పెట్టవద్దని ఆదేశించారు.



# బైండోవర్ అయిన ముగ్గురికి జరిమానా

**వేములవాడ, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు యేంద్రాల నాగరాజు, కిరణ్ కుమార్, శ్రీనివాస్ లను పోలీసులు గతేడాది బైండోవర్ చేశారు. బైండోవర్ అయిన తర్వాత భూమి తగాదాల కారణంగా వారిపై కేసు నమోదు కావడంతో వేములవాడ రూరల్ తహసీల్దార్ గురువారం వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయటం జరుగుతుందని, బైండోవర్ నందు తహసీల్దార్ నిర్దేశించిన గడువులోగా వారి మీద ఏదైనా కేసు నమోదైతే బైండ్ డౌన్ చేయటం జరుగుతుందన్నారు. దీని ప్రకారం సదరు వ్యక్తులకు షూరిటీ మొత్తం లేదా జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# కళాకారులకు గుర్తింపు, హెల్త్ కార్డులు అందించాలి

**తెలంగాణ ప్రజా నాట్య మండలి**



**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి తరపున కళాకారుల సమస్యల పరిష్కరిం చాల ని కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డులు, ఆరోగ్య హెల్త్ కార్డులు ఇవ్వాలని, క్రీడా రంగానికి ఇచ్చే ప్రాధాన్యతను. కళాకారులకు ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ కళాకారులకు సంఖ్యతో నిమిత్తం లేకుండా అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని పలు సమస్యల వినతి పత్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుకి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కళాకారుల సమస్యల పరిష్కా రం కోసం కృషి చేస్తామని అన్నారు. త్వరలోనే కళాకారులు , కవులుతో సమావేశం ఏర్పాటు చేసి తగు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, కన్నం లక్ష్మీనారాయణ, కేతరాజు ఉప్పలయ్య, గన్నారపు రమేష్, సైదులు, పద్మ వెంకటేష్, సబ్బి రాజమౌళి పాల్గొన్నారు.



# 18న పద్మశాలి సంఘం ఎన్నికలు

**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్ర పద్మశాలి సంఘం రిజిస్టర్ 98/2023 అధ్యక్ష ఎన్నిక లు ఆగస్టు 18న జరగనున్నాయి. ఎన్ని కల నేపథ్యంలో అభ్యర్థులు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఒక బ్యాలెట్ పేపర్‌తో ఎలక్షన్లు జరగబోతు న్నాయని తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థిగా పోటీల్లో ఉన్నవల్ల కాటి రాజకు మార్ కి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు గోశిక యాదిగిరి , మ్యాడం బాబురావు ,24 జిల్లాల అధ్యక్షులు సీనియర్ పద్మశాలి పెద్దలు అందరూ కూడా సంపూర్ణ మద్దతు తెలిపారు. కావున తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కుల బాం ధవులు అందరూ కూడా మగ్గం గుర్తుకు ఓటు వేసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థిగా ఉన్న వల్లకాటి రాజకుమార్ ని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని పద్మశాలి నాయకులు కోరారు. భారతదేశ చరిత్రలోనే ఒక సంఘం లో 48 వేల ఓట్లతో ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి అని పలు సంఘాల నాయకులూ తెలిపారు. ఈ పద్మశాలీలంతా ఈ యొక్క (టీఆర్పీఎస్) 98/2023 సభ్యత్వం పొందిన అందరూ కూడా ఈ ఎన్నికలలో పాల్గొని వల్ల కాటి రాజ్ కుమార్ గెలిపించాలని కోరారు.

# మహిళ అదృశ్యం



**ఎల్బీనగర్, ప్రజానావ:** మహిళ అదృశ్యమైన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నారాయ ణగూడలో మున్సిపల్ కార్మికురాలుగా పనిచేసే శోభ (45) జూన్ 5న నారాయణగూడలో పనికి వెళుతున్నా ను అని చెప్పి తిరిగి రాలేదు. తెలిసిన వారిని, తోటి మిత్రులను, ఉద్యోగులను, ఇరుగుపొరుగు వారిని అడిగిన సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసు లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నాగచైతన్య , నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం

### వివరాలు వెల్లడించిన తండ్రి నాగార్జున



టాలీవుడ్ హీరో నాగచైతన్య , నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను నటుడు నాగార్జున సోషల్‌మీడియాలో పంచుకున్నారు. నా తనయుడు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం ఈరోజు ఉదయం 9.42 గంటలకు జరిగింది. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం సంతోషంగా ఉంది. మా కుటుంబంలోకి ఆమెను సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. నూతన జంటకు నా అభినందనలు. వీరి జీవితం సంతోషం, ప్రేమతో నిండాలని కోరుకుంటున్నా 8.8.8 అనంతమైన ప్రేమకు నాంది అని నాగార్జున పేర్కొన్నారు. దీనిపై పలువురు నెటిజ న్లు స్పందించారు. కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. నాగచైతన్యకు గతంలో నటి సమంతతో పెళ్లయ్యాక కొంతకాలానికి వ్యక్తిగత కారణాల వల్ల వారిద్దరూ విడిపోయారు. చై-శోభిత ఎంతోకాలం నుంచి స్నేహితు లుగా ఉ న్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. శోభిత ధూళిపాళ్ల 2013లో ఫెమినా మిస్ ఇండియా టైటిల్ విన్నర్‌గా నిలిచారు. 2016లో సినీ రంగంలోకి ప్రవేశించారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు.





## రేర్ రికార్డుకు ట్రై చేస్తున్న తమన్నా, రష్మిక..

ఈ ఏడాది ఒక రేర్ అచీవ్‌మెంట్‌ని సొంతం చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు సీనియర్ తమన్నా అండ్ నేషనల్ క్రష్ రష్మిక మందన్న. అంత రేర్ అచీవ్‌మెంట్ ఏంటి? ఏ మూవీతో ఓన్ చేసుకోబోతున్నారని అనుకుంటున్నారా? ఒక్కతో కాదండీ బాబూ... డబుల్ ధమాకాతో.. యస్.. ఒకే రోజు రెండు ల రిలీజుల్ని చూడబోతున్నారు తమన్నా అండ్ రష్మిక. ఆ డీటైల్స్ మాట్లాడుకుందాం.. పదండి... ఈ ఏడాది ఒక రేర్ అచీవ్‌మెంట్‌ని సొంతం చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు సీనియర్ తమన్నా అండ్ నేషనల్ క్రష్ రష్మిక మందన్న. అంత రేర్ అచీవ్‌మెంట్ ఏంటి? ఏ మూవీతో ఓన్ చేసుకోబోతున్నారని అనుకుంటున్నారా? ఒక్కతో కాదండీ బాబూ... డబుల్ ధమాకాతో.. యస్.. ఒకే రోజు రెండు ల రిలీజుల్ని చూడబోతున్నారు తమన్నా అండ్ రష్మిక. ఆ డీటైల్స్ మాట్లాడుకుందాం.. పదండి... స్త్రీ2లో తమన్నా చేసిన స్పెషల్ సాంగ్ చూసి నార్త్ కుర్రకారు ఊగిపోతున్నారు. అంతలా మెప్పించాయి మిల్కీబ్యూటీ స్టెప్పులు. ఆగస్టు 15న శ్రద్ధాకపూర్‌కన్నా, తమన్నా కోసమే స్త్రీ2కి వెళ్తామనే వారి సంఖ్య పెరిగింది. బట్, సేమ్ డే వేదాతో పలకరించడానికి కూడా నేను రెడీ అంటున్నారు మిల్కీ బ్యూటీ. టూ ఇన్ ఒన్ ఆప్షన్ ఇచ్చి... ప్లీజ్ చూజ్ అంటూ కొంటెగా కన్నుగీటుతున్నారు ఈ లేడీ. ఆగస్టులో రష్మిక మందన్న చేస్తున్న ఈ ఫీట్‌ని డిసెంబర్‌లో నేషనల్ క్రష్ రష్మిక రిపీట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 6న విడుదల కానుంది పుష్ప2. ఈ లో శ్రీవల్లిని చూడ్డానికి మేమంతా రెడీ అంటున్నారు ప్యాన్ ఇండియన్ ఆడియన్స్. పుష్ప2 రిలీజ్ అవుతున్న సేమ్ డే థియేటర్లలోకి దూసుకు రానుంది చావా. ఆల్రెడీ యానిమల్‌తో నార్త్ బెల్ట్ లో సత్తా చూపించిన రష్మిక, ఇప్పుడు చావాతో మరో సారి ప్రూవ్ చేసుకోవడానికి రెడీ అవుతున్నారు. సో 2024ని తమన్నా, అండ్ రష్మిక డబుల్ ధమాకా రిలీజులతో మార్క్ చేసుకోబోతున్నారన్నమాట.



## విరాట్ కోహ్లీ అంటే పిచ్చి ఇష్టం..

### మృణాల్ ఠాకూర్

దక్షిణాది సినీ ప్రియులకు ఇష్టమైన హీరోయిన్ మృణాల్ ఠాకూర్. సీతారామం తో సౌత్ అడియన్స్ ముందుకు వచ్చిన ఈ బ్యూటీ మొదటి తోనే సీతామహాలక్ష్మీగా ప్రేక్షకులకు దగ్గరైంది. ఆ తర్వాత తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంది ఈ ముద్దుగుమ్మ. చివరగా విజయ్ దేవరకొండ సరసన ఫ్యామిలీ స్టార్ లో నటించిన మృణాల్.. ప్రస్తుతం హిందీతోపాటు పలు వెబ్ సిరీస్ చేస్తుంది. అలాగే తెలుగులో ఆఫర్స్ అందుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా తన ఇన్ స్టాలో ఆసక్తికర పోస్ట్ చేసింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ తనకు క్రికెట్ అంటే చాలా ఇష్టమని.. అలాగే విరాట్ కోహ్లీ అంటే కూడా చాలా పిచ్చి అని చెప్పుకొచ్చింది. ఇప్పుడు అవే కామెంట్లను మరోసారి వైరల్ చేస్తున్నారు. దీనిపై మృణాల్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎప్పుడో చేసిన వ్యాఖ్యలను ఇప్పుడు మళ్లీ ప్రచారం చేయొద్దని కోరింది. ఓ మీడియా పోర్టల్ తన ఇన్ స్టాలో మృణాల్ కు విరాట్ కోహ్లి అంటే ఎంత ఇష్టమో తెలియజేస్తూ రాసుకొచ్చింది. దీనిపై స్పందించిన మృణాల్ ఆ పోస్ట్ కింద ఇక చాలు.. ఇకనైనా ఆపేయండి అంటూ కామెంట్ చేసింది. గతంలో జెర్సీ ప్రమోషన్లలో మృణాల్ మాట్లాడుతూ క్రికెట్ పై తనకున్న అభిమానాన్ని బయటపెట్టింది. తన సోదరుడితోపాటు క్రికెట్ చూడడం అలవాటుగా మారిందని.. విరాట్ కోహ్లీని పిచ్చిగా ప్రేమించిన రోజులున్నాయని.. అలాంటిది క్రికెట్ నేపథ్యంలో వచ్చిన లో నటించడం సంతోషంగా ఉందని తెలిపింది.



# ఫసల్ బీమా యోజనతో రైతులకు అండ

## ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో ఆనందం

**నిజామాబాద్, ప్రజానావ:** కేంద్రం తీసుకుని వచ్చిన ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులకు మేలు జరుతుందని కూడా తెలిపింది. రైతులను ఆదుకునే క్రమంలో పసల్ బీమా యోజనలో చేరడం, రైతల కిస్తీ కూడా ప్రభుత్వమే భరిస్తుందిన సిఎం, డిప్యూటి సిఎంలు కూడా వెల్లడించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది..ప్రకృతి కరుణించక అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతూ... ఇక వ్యవసాయం వద్దు అనుకునే రైతన్నకు ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన అండగా నిలుస్తోంది. దేశానికి వెన్నుముక రైతు, రైతు పంటలు పండిస్తేనే ప్రజలకు ఐదు వెళ్ళు నోట్లోకి వేలుతాయి. అలాంటి రైతు తాము పండించిన పంటకు అకాల వర్షాలతోనో అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతే అ రైతు పరిస్తితి ఏంటి అనుకునే తరుణంలో ఫసల్ బీమాయోజన వారికి ఆసరాగా నిలిచింది. పంట నష్టపోయిన రైతన్నను అమ్మలా అదుకుంటూతుంది. వ్యవసాయం దండుగ అని గతంలో అన్న రైతుకు వ్యవసాయం పండుగా అనేలా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలకు బెదరకుండా తమ భూమిని సాగు చేసి వ్యవసాయాన్ని చేసే దైర్యాన్ని ఇస్తుంది.. ఫసల్ బీమా యోజన పథకం. రైతు తాము పండించే పంట పెట్టుబడి ఎకరాకు అందులో రెండు శాతం ఫసల్ బీమా పథకం ప్రీమియం కడితే చాలు వరిపంటకు ఎకరాకు 34 వేల బీమా ఉండగా అందులో 2 శాతం అంటే 680 రూపాయలు ప్రీమియం కడితే చాలు అలగే మొక్క జొన్న ... వేరుశనిగే పంటలకు రెండు శాతం ఉండగా పసుపు పంటకు మాత్రం 3.5 శాతం ప్రీమియం చెల్లిం చాల్సి ఉంది.. దీంతో రైతుకు ఎదురయ్యే ఇబ్బం దులు తెగుళ్ళు.. వడగళ్ళు.. పిడుగులు.. అకాల వర్షాలతో పంట నష్టపోతే ఆ రైతుకు ఫసల్ బీమా రక్షణగా నిలుస్తుంది.. వీటితో పాటు ఇందులోనే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా పత్తి పంటతో పాటు మిర్చి పంటకు కూడా రైతు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే వాతావరణం అనుకులించాకున్న వేసిన విత్తనం మొలకేత్తకపోయిన రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పెట్టుబడి నష్టపోకుండా ఫసల్ బీమా పథకం అండగా నిలుస్తుంది. పంట కోత తర్వాత జరిగే నష్టాలకూ బీమా వర్తిస్తుంది. పంటనష్టం జరిగిందని తెలియగానే బీమా మెంత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. అంతేకాదు క్లెయిమ్ సెటిల్ కోసం పంట నష్టాన్ని అంచనా వేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడతారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా పంట కోత సమాచారాన్ని ఫొటోలు తీసి, అప్‌లోడ్ చేస్తారు. గతంలో ఎన్నో పంట బీమా పథకాలు ఉన్న కూడా తాము అకాల వర్షాలతో నష్టపోయేవాళ్ళమని... ఇప్పుడు ఫసల్ బీమాపై వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించడంతో తాము వ్యవసాయం అంటే కష్టం కాదని వ్యవసాయాన్ని ఇష్టంతో చేసుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

# బీజేపీతో బంధమా.. విలీనమా..!



## కేసీఆర్ అడుగులు హస్తిన వైపు పడేనా?

## బీఆర్ఎస్, బీజేపీల రాజకీయాలపై సర్వత్రా చర్చ

**పదేళ్లపాటు అధికారం అనుభవించి, ఆర్థికంగా బలపడి, ఇష్టారాజ్యంగా పాలన చేసిన బిఆర్ఎస్‌కు ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడడం లేదు. వరుసగా మూడోసారి అధికారం తమదే అనుకున్న తరుణంలో పరిస్థితులు తలకిందులు అయ్యాయి. ఈ ఉక్కపోతను కెసిఆర్ కుటుంబం భరించకోలేక పోతున్నది. ఓ వైపు విచారణ, మరోవైపు విమర్శలు, ఇంకోవైపు కూతురు కవిత జైలకు వెళ్లడం వంటి విషయాలు కెసిఆర్‌ను పుండులాగా సలుపుతున్నాయి. అందుకే దీనిని నుంచి బయటపడే మార్గాల గురించి ఆలోచన చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ప్రధానంగా రేవంత్ సిఎం కావడాన్ని బిఆర్ఎస్ తట్టుకోలేక పోతోంది.ఈ క్రమంలో దీనికి చెక్ పెట్టాలన్న ఆలోచన నుంచే బిజెపికి చేరువ కావాలన్న సూత్రం పుట్టిందన్న ప్రచారం సాగుతోంది. ప్రధానంగా రెండు విషయాలపై బిఆర్ఎస్‌లో అంతర్గతంగా చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ బిఆర్ఎస్ అంటే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు లాంటి వారి మధ్యనే అని గుర్తించాలి. ప్రస్తుత రాజకీయాలను మలుపు తిప్పాలన్నదే వారి ఎత్తుగడగా ఉంది.**


**- హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ**

కేంద్రంతో సఖ్యతగా ఉంటూ కవితను విడిపంచుకోవడం.. బిఆర్ఎస్ మద్దతను బిజెపికి తెలపడం. అయితే దీనివల్ల కేవలం కవిత [illegible]. కానీ అధికారం దక్కదు. అందుకే ఎన్‌డిఎలో చేరేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఐదుగురిలో కేశవరావు జారుకుని రాజీనామా చేశారు. బిజెపికి కూడా రాజ్యసభలో బలం అవసరం. నలుగురు రావడం అంటే తక్కువేమీ కాదు. అందుకే బిఆర్ఎస్, బిజెపిల విలీనపై ఈ మధ్య పుంఖానుపుంఖాలుగా వార్తలు తన్నుకు వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా బిఆర్ఎస్ విలీనం అయితే కెసిఆర్ కేంద్రమంత్రిగా ఢిల్లీకి వెళ్లడం.. ఒప్పందంగా ఉండొచ్చు. తదుపరి కాలంలో తెలంగాణలోనూ షిండేలను సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అన్నది కావచ్చు. ఇవన్నీ కూడా ఊహాజనితమే అయినా ..వీటిచుట్టే ప్రచారం సాగుతోంది. బిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు కలిశాక వారి బలం ఇప్పుడున్న పరిస్థితుల్లో 36కు చేరుకుంటుంది. ఓ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. వారిని కూడా వెనక్కి రప్పించడం జరగవచ్చు. లేదా కోర్టు ద్వారా ఒకరిద్దరి పై వేటు వేయించి దారికి తెచ్చుకునే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి.అందుకే తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయనే భ్రమను కలిపిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగైదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది. కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్ర పూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు. గత నెలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. కొన్ని కీలక సమావేశాలు ఉన్నప్పటికీ వారు ఢిల్లీలో మకాం వేశారు. వారు ఎవరితో సమావేశమయ్యారో ఎవరికీ తెలియదు. వీరి ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పుడు తాజాగా మరోసారి కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. ఒక్క రోజు కొంతసేపు కవితతో తీహార్ జైల్లో ములాఖత్ అయ్యారు. మిగిలిన రోజుల్లో ఏం చేస్తున్నారో .. ఎవరితో సమావేశం అవుతున్నారో స్పష్టత లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్లుగా ఓసారి ఫోటో రిలీజ్ చేశారు. అందుకోసం రోజుల తరబడి అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. వీరు బీజేపీ పెద్దలతో రహస్యంగా విలీన ప్రతిపాదనపై చర్చలు జరుపుతున్నారన్న బలమైన సమాచారం బయటకు రావడంతో కొంత మంది నేరుగా ఈ విషయాన్ని ప్రచారం చేస్తున్నారు. నిజానికి నిప్పులేనిదే పొగరాదు. ఎక్కడో ఒకచోట్‌ఏదో ఒక సందర్భం లేకుండా ఇలాంటి వార్తలు రావు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి విలీనం చర్చలు జరగకపోతే.. ఈ విషయాన్ని ఖండించడానికి రెండు పార్టీలు ఎందుకు తటపటాయిస్తున్నాయన్నది రాజకీయవర్గాల నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. నిర్మోహమాటంగా ఖండించడానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు సిద్దంగా లేరు.కీలక నేతలు ప్రతి రోజూ తెలంగాణ భవన్ లో ప్రెస్మీట్లు పెడుతున్నారు కానీ.. బీజేపీతో పొత్తు లేదా విలీనం అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించడానికి నిరాకరిస్తున్నారు. కేటీఆర్ కూడా ఓ ట్వీట్ పెట్టారు కానీ.. బీజేపీతో ఎలాంటి సంబంధాలు ఉండవని ఖచ్చితంగా చెప్పడం లేదు. తెలంగాణ కోసం పోరాడతామని చెబుతున్నారు. నిప్పు లేనిదే పొగ రాదన్నట్లుగా ఢిల్లీలో ఏదో జరుగుతోందని సులువుగా అర్థమైపోతుంది. స్వయంగా మజ్లిస్ పార్టీ చీఫ్ అసుద్దన్ ఓవైసీ కూడా ఈ అంశంపై బీఆర్ఎస్‌ను ప్రశ్నించినా స్పందన లేదు. నిజానికి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పొత్తు లేదా విలీనం అంశంపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయని బీఆర్ఎస్సే నేరుగా ప్రతిపాదన పెట్టినా.. తెలంగాణ బీజేపీ నేతల్లో ఏకాభిప్రాయం లేకపోవడం వల్లనే డీల్ ఆలస్యమవుతోందని ఢిల్లీ వర్గాలు గట్టిగా చెబుతన్నాయి. బీఆర్ఎస్‌తో తీవ్రంగా పోరాడిన ముగ్గురు ఎంపీలు ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకున్నా సరే అది బీజేపీకి నష్టం చేస్తుందని గట్టిగా వాదిస్తున్నారని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ బలం.. బీజేపీకి కలసి వస్తుందని.. కింది స్థాయి వరకూ పార్టీ నిర్మాణం ఏర్పడుతుందని .. ఇతర సీనియర్ నేతలు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగానే చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని వ్యతిరేకించే వారిని .. సముదాయించి అధికారిక ప్రకటన చేస్తారని చెబుతున్నారు. అయితే బీఆర్ఎస్ క్యాడర్ మాత్రం.. అలాంటి పరిస్థితి రాదని.. కేసీఆర్ తన పార్టీని ఇతర పార్టీల్లో కలిపేంత నిర్ణయం తీసుకోరని అనుకుంటు న్నారు. మొత్తంగా ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

# సాహసోపేత నిర్ణయాలకు పూనుకోవాలి

## •సమస్యలపై మరింత శ్రద్ధ పెట్టాలి •సత్తాచాటే నిర్ణయాలతోనే మోడీకి ఇమేజ్

**న్యూఢిల్లీ:** మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదేళ్ల పాలన అవినీతిరహితంగా సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇకపోతే ఇంకా పట్టిపీడిస్తున్న సమస్యలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా నిరుద్యోగం, ఆహారభద్రత, కరెంట్,నీళ్లు వంటి సమస్యలపై దృష్టి సారించాలి. నదీజలాల విషయంలో సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. నదుల అనుసంధానం ద్వారా దేశాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలి. జిఎస్టీ లాంటి పన్నులు విధానంపై చర్చించాలి. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత తీసుకుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయి. ట్రిపుల్ తలాక్‌కు మంగళం పాడడంతో ముస్లిం మహిళలకు వివాహబంధం విషయంలో భరోసా దక్కింది. అలాగే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు కూడా సాహసోపేత నిర్ణయంగా నిలిచిపోనుంది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ చేసి దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. అలాగే అవినీతి మరక అంటకుండా మోదీ దేశాన్ని పాలించారన్న ప్రశంసలు ఉన్నాయి. ఇకపోతే కరోనా వ్యాక్సిన్ తయారీ, ప్రోత్సాహంలో దేశం అతిపెద్ద విజయం సాధించిందనే చెప్పాలి. దేశంలోని ప్రజలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించడమే గాకుండా,అనేక దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించి ఆపన్నహస్తం అందచేసింది. ఇలాంటి తరుణంలో మూడోసారి అధికారంలోకి వచ్చారు. అయితే ప్రజలు పూర్తి మెజార్టీ ఇవ్వలేదు. అందువల్ల ప్రజలు మెచ్చే విధంగా పాలన సాగించాల్సి ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించాలి. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకోవాలి. సమస్యలు గుర్తించాలి. గత పదదేళ్లుగా తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా మోదీ జాగ్రత్తగా వ్యవహరించారు. ఎక్కడా



ఒక కుంభకోణం అన్నది లేకుండా పాలన సాగిస్తున్న తీరు ప్రజలనుంచి అభినందనలు వస్తున్నాయి. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకున్నారు. అయితే పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జిఎస్టీతో ప్రజలకున్న ఆశలు అడియాశలయ్యాయి. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు సత్ఫలితాలు ఇవ్వక పోగా కాంగ్రెస్‌ను బలోపేతం చేశాయి. ఇది బిజెపికి దెబ్బగానే చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టుకోలేం. భారతీయ జనతా పార్టీ విస్తరణ కాంక్ష మోదీ, షాలను నిలవనివ్వడం లేదు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. ఇదో గుణపాఠం కావాలి. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడాలన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టి పోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోదీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది. ఇప్పుడు అదే పంథాను బిజెపి అనుసరిస్తోంది. బిజెపి ఇప్పుడు మిగతా పార్టీలకు భిన్నంగా ఏమీ లేదు. రాజకీయ స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తోంది. ఆ తెగువ పాలనలో కూడా చూపితే దేశం బాగుపడుతుంది. కేవలం విపక్షాలపైనే విచారణలు అన్న ఆరోపణలు పోవాలి. తప్పు చేసిన వారిపై విచారణలు జరగాలి. ఎపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ లాంటి వారి అవినీతిపైనా చర్యలు ఉండాలి. రాజకీయాలు పక్కన పెట్టి దేశం గురించి ఆలోచనచేయాలి. అప్పుడే బిజెపి పట్ల ఆదరణ పెరుగుతుంది.



# కష్ట సమయంలో తల్లిని చూడలేకపోతున్నా

## హసీనా కూతురు సైమా వాజిద్ ఎక్స్ వేదికగా పోస్ట్

**న్యూఢిల్లీ :** ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యా ర్థుల ఉద్యమం హింసాత్మకంగా మారడంతో పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాగ్రహానికి జడిసి ప్రధాన మంత్రి పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి దేశం వీడారు. ప్రస్తుతం హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులపై హసీనా కుమార్తె సైమా వాజెద్ స్పందించారు. ఈ కష్టసమయంలో తన తల్లిని చూడలేకపోతున్నానంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'నేను ఇష్టపడే నా దేశం బంగ్లాదేశ్‌లో జరిగిన ప్రాణనష్టం చూసి గుండె పగిలింది. ఈ కష్ట సమయంలో నా తల్లిని చూడలేకపోయాననే, కౌగిలించుకోలేకపోయానే అన్న బాధ నా గుండెను పిండేస్తోంది. ప్రపంచ ఆరోగ్యసంస్థలో రీజినల్ డైరెక్టర్‌గా నా విధి నిర్వహణకు కట్టుబడి ఉండాల్సి వచ్చింది' అని సైమా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. కాగా, షేక్ హసీనాకు ఇద్దరు పిల్లలు అన్న విషయం తెలిసిందే. కుమార్తె సైమా వాజెద్, కుమారుడు సాజీద్ వాజెద్ జాయ్ ఉన్నారు. సైమా ఈ ఏడాది ఫిబ్రవరిలో డబ్ల్యూహెచ్‌వోకు ఎన్నికయ్యారు. ఆగ్నేయ ఆసియా రీజినల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో నివాసం ఉంటున్నారు. ఇక హసీనా కుమారుడు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న విషయం తెలిసిందే.

www.prajanaava.in || హైదరాబాద్ శుక్రవారం, ఆగస్టు 9, 2024 || ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..

## 4గంటల్లో 2కేజీలు తగ్గిన మేరీకోమ్

# మరి వినేశ్ ఎందుకిలా?

**పారిస్ :** భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ 100 గ్రాముల అధిక బరువు ఉండడం వల్ల పారిస్ ఒలింపిక్స్ లో అనర్హత వేటు పడడంపై దేశవ్యాప్తంగా అభిమానులు షాక్ కు గురయ్యారు. ఈ నేపథ్యంలో రెజ్లింగ్ నిబంధనలు ఏంటనే దానిపై చర్చ జరుగుతోంది. అథ్లెట్లు చాలా తక్కువ సయమంలో బరువు తగ్గుంచుకోగలరని, ఇలా చాలా సార్లు జరిగిందని వాదనలు వినిపిస్తున్నాయి. ఆరేళ్ల క్రితం భారత స్టార్ బాక్సర్ మేరీ కోమ్ కేవలం 4 గంటల్లోనే 2 కిలోల బరువు తగ్గడాన్ని గుర్తు చేసుకుంటున్నారు. 2018లో పోలండ్ వేదికగా జరిగిన సిలేసియన్ బాక్సింగ్ టోర్నీలో 48 కేజీల విభాగంలో పోటీపడిన మేరీకోమ్, ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముందు 50 కిలోలు ఉంది. అంటే కచ్చితంగా పోటీల్లో అనర్హతకు గురవుతుంది. అయితే ఆటకు ముందు బరువు పరిశీలించే కార్యక్రమానికి మరో 4 గంటలే సమయం ఉంది. వెంటనే బరువు తగ్గించు కోవడంపై మేరీకోమ్ దృష్టి సారించింది. కేవలం 4 గంటల్లోనే 2 కిలోల బరువు తగ్గింది. అంతేకాదు ఈ టోర్నీలో స్వర్ణం



గెలిచింది. రెండు కిలోల బరువు తగ్గడానికి మేరీకోమ్ చాలా కష్టపడింది. ఒక గంటపాటు స్కిప్పింగ్ చేసింది. అలాగే బరువు తగ్గడానికి ఇతర వ్యాయామాలు చేసింది. దీంతో బరువు తూకం సమయానికి మేరీకోమ్ 50 నుంచి 48 కిలోలకు తగ్గింది. దీంతో ఆమె అనర్హత వేటు నుంచి తప్పించుకుని దేశానికి బంగారు పతకాన్ని అందించింది. అథ్లెట్లు తమ కేటగిరీలో ఉండాల్సిన బరువు కన్నా ఎక్కువ ఉంటే భారీ వ్యాయామాలు చేస్తారు. చెమటలు పట్టడానికి ప్రత్యేకమైన ఎఫ్ బీటీ షూట్ ను ధరిస్తారు. దీంతో చెమట రూపంలో శరీరంలో ఉన్న నీరు ఎక్కువగా బయటకు పోయి బరువు తగ్గుతారు. క్రీడాకారిణి ఆయా కేటగిరిలో ఉన్నారని నిర్ధరించేందుకు పోటీ జరిగే రోజు ఉదయం బరువును కొలుస్తారు. అప్పుడు ఎక్కువ బరువు ఉన్నట్లు తేలితే అనర్హతకు గురవుతారు. ప్రతి బరువు కేటగిరిలో రెండు రోజులపాటు టోర్నమెంట్ జరుగుతుంది. వినేశ్ పోటీపడే 50 కిలోల విభాగంలో పోటీలు మంగళవారం, బుధవారం జరుగుతున్నాయి. క్రీడాకారులను బరువు తూచే సమయంలో వారికి 30 నిమిషాల వ్యవధి ఇస్తారు. ఈ వ్యవధిలో వారు ఎన్నిసార్లైనా తమ బరువును కొలుచుకోవచ్చు. ఇక రెండో రోజు కూడా పోటీపడే వారికి బరువు కొలతలకు 15 నిమిషాలే కేటాయిస్తారు. ఆ సయమంలోనే నిర్ణీత బరువు ఉంటే ఫర్వాలేదు. లేదంటే అనర్హత వేటు తప్పదు. ఈ క్రమంలో బుధవారం వినేశ్ పై అనర్హత పడింది.

## వినేశ్‌కు హర్యానా
# గవర్నమెంట్ సత్కారం

**పారిస్ :** అధిక బరువు కారణంగా ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలిచే అవకాశం కోల్పోయిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌ను హరియాణా ప్రభుత్వం విజేతగానే పరిగణించి స్వాగత, సత్కారాలు చేయనుంది. ఈ మే-రకు హరియాణా సీఎం నయాబ్‌సింగ్ షైనీ ఓ ప్రకటన చేశారు. ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన వారికి ఇచ్చే రివార్డ్‌ను ఆమెకు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. హరియాణా రాష్ట్ర ప్రభుత్వ క్రీడా విధానం ప్రకారం ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన వారికి రూ.6కోట్ల నగదు, రజతం అయితే రూ.4కోట్ల రివార్డ్, కాంస్య పతకం సాధించిన వారికి రూ.2.5 కోట్ల నగదు పురస్కారం ఇస్తారు. ఇప్పుడు హరియాణా ప్రభుత్వం కూడా వినేశ్ ఫొగాట్‌ను రజత పతక విజేతగా పరిగణించి, ఆమెకు రూ.4 కోట్ల నగదు పురస్కారాన్ని అందజేయనుంది. ఇక వినేశ్ రిటైర్మెంట్‌పై రియాక్ట్ అయిన ఆమె ఆమె పెద్దనాన్న మహావీర్ ఫొగాట్ తన ఈ నిర్ణయం గురించి మరోసారి ఆలోచించాలని కోరారు. అవసరమైతే తాను ఆమెతో



కూర్చొని మాట్లాడతానంటూ మహావీర్ తాజాగా మీడియాకు వెల్లడించారు. అనర్హత వేటు పడిన వెంటనే వినేశ్‌కు మద్దతు తెలిపిన ఆయన వచ్చే ఒలింపిక్స్‌కు తనను సిద్ధం చేస్తానంటూ హామీ కూడా ఇచ్చారు. "రెజ్లింగ్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ఆమ ఈ రోజు ఉదయం 5 గంటలకు నాతో చెప్పింది. పతకం సాధించేందుకు ఇంత చేరువగా వచ్చి దాన్ని కోల్పోవడం తనను మానసికంగా ఇబ్బందికి గురిచేసింది. దీంతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. అయితే, ఈ రిటైర్మెంట్ నిర్ణయం నుంచి ఆమె వెనక్కి రావాలని చెబుతున్నాను.

## అమన్ సెరావత్‌కు కాంస్యం సాధించే ఛాన్స్

**పారిస్ :** భారత రెజ్లర్ అమన్ సెరావత్‌కు పారిస్ ఒలింపిక్స్ 2024లో చుక్కెదురైంది. తొలి రెండు రౌండ్లలో అదరగొట్టి సెమీస్ కు చేరిన అమన్.. అదే ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో జరిగిన సెమీస్ పోరులో జపాన్ రెజ్లర్ రె హిగూచి చేతిలో టెక్నికల్ సుపి రియారిటీతో ఓడిపోయాడు. ఈ మ్యాచ్ లో అమన్ 0-10 పాయింట్ల తేడాతో జపాన్ రెజ్లర్ చేతిలో ఓడాడు. సెమీస్ లో ఓడినప్పటికీ కాం స్య పతకం గెలిచే అవకాశం అమన్ కు ఇంకా ఉంది. శుక్రవారం జరిగే బ్రాంజ్ మెడల్ బౌట్ లో అతడు మరోసారి బరిలోకి దిగతాడు. అంత కుముందు జరిగిన తొలి రౌండ్ బౌట్ లో





అమన్ సెరావత్ ప్రత్యర్థిపై టెక్నికల్ సూపిరియారిటితో విజయాన్ని అందుకున్నాడు. నార్త్ మెసడోనియా రెజ్లర్ వ్లాదిమిర్ ఇగొరొవ్ పై అమన్ ఏకపక్ష విజయాన్ని అందుకున్నాడు. ఏకంగా 10-0 పాయింట్లతో మట్టికరిపించాడు. అనంతరం జరిగిన క్వార్టర్ ఫైనల్ బౌట్ లో అల్బేనియా రెజ్లర్ అబకరోవ్ పై కూడా టెక్నికల్ సూపిరియారిటితో విజయాన్ని అందుకున్నాడు. ఈ బౌట్ లో అమన్ 12-0 పాయింట్ల తేడాతో విజయాన్ని అందుకుని సెమీస్ లోకి ప్రవేశించాడు.

# అందమే ఆమెకు శాపమైంది

### కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన పరాగ్వే స్విమ్మర్

**పారిస్:** పరాగ్వేకి చెందిన లువానా అలాన్సో అనే 20 ఏళ్ల స్విమ్మర్ పారీస్ ఒలింపిక్స్‌లో తన దేశం తరపున పాల్గొనడానికి వచ్చింది. చిన్న వయసులోనే బటర్‌ఫ్లై ఈవెంట్లో అనేక రికార్డులు కలిగి ఉంది. టోక్యో ఒలంపిక్స్‌లో కూడా లువానా పాల్గొన్నది. కానీ పతకం దక్కలేదు. ఇక ఈ సారి ప్యారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనే పట్టుదలతో తన దేశ అథ్లెట్లతో కలిసి వచ్చింది. ఒలింపిక్ విలేజ్‌లో అందరితో పాటే కలిసి ఉన్నది. 100 మీటర్ల బటర్‌ఫ్లై కేటగిరీలో క్వార్టర్ ఫైనల్స్ కూడా గెలిచి.. సెమీస్‌కు చేరుకుంది. కానీ దురదృష్ట వశాత్తు సెమీస్‌లో వెనుదిరిగింది. కానీ కథ ఇక్కడితో ఆగిపోలేదు. ఒలింపిక్ విలేజ్‌లోనే తోటి పరాగ్వే అథ్లెట్లతో కలిసి ఉంటోంది. తనకు ఇక ఎలాంటి పోటీ లేకపోవడంతో అందరితో కలివిడిగా తిరుగుతోంది. అయితే లువానా అలాన్సో అందం కారణంగా తాము పోటీలపై కాన్సన్‌ట్రేషన్ చేయలేకపోతున్నామని తోటి పరాగ్వే మేల్ అథ్లెట్లు కంప్లైంట్ చేశారు. తన అందంతో ఆమె చాలా డిస్టర్బ్ చేస్తోందని.. అంతే కాకుండా తమ ఏకాగ్రత దెబ్బతినేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు.





ఆమె ఉంటే మేము ఆటల్లో సరిగా పాల్గొనలేమని మేనేజ్‌మెంట్‌కు చెప్పారు. పరాగ్వే జట్టు మేనేజ్‌మెంట్ కూడా మేల్ అథ్లెట్ల మాటే విన్నది. వెంటనే విషయాన్ని తమ దేశంలో ఉన్న ఉన్నతాధికారులకు చేరవేశారు. ఇంకేముంది.. లువానా అందం కారణంగా పరాగ్వే ఆటగాళ్లు సరైన ప్రదర్శన చేయలేకపోతున్నారని డిసైడ్ అయ్యారు. వెంటనే ఆమెను దేశానికి తట్టాబుట్టా సర్దుకొని వచ్చేయా లని హుకుం జారీ చేశారు. వాస్తవానికి ఓడిపోయిన ఆటగాళ్లు ఒలింపిక్స్ ముగిసే వరకు విలేజ్‌లో ఉండటానికి అర్హులే. కానీ స్వయంగా పరాగ్వే టీమ్ మగ ఆటగాళ్లే కంప్లైట్ చేయడంతో ఆమెను బయటకు పంపించక తప్పలేదు. స్విమ్మింగ్‌లో ఎంతో భవిష్యత్ ఉన్న లువానా ఈ ఘటనతో తీవ్రమైన ఆవేదన చెందింది. కేవలం 20 ఏళ్ల లువానాకు ఇంకా ఎంతో కెరీర్ మిగిలి ఉంది. కానీ తోటి అథ్లెట్ల కారణంగా స్విమ్మింగ్‌కు గుడ్ బై చెప్పింది. తాను ఇకపై దేశం తరపున ప్రొఫెషనల్ స్విమ్మింగ్ చేయనని చెప్పింది. సొంత దేశపు ఆటగాళ్లే తనపై తప్పుడు ఆరోపణలు చేసి.. తానే వారిని ఏదో చేసినట్లు పుకార్లు పుట్టించడం చాలా బాధగా ఉందని ఆమె పేర్కొన్నది. పాశ్చత్య మీడియా కూడా అంటూ తన అందాన్ని వర్ణిస్తూ వార్తలు రాయడంపై మండిపడింది. ఒక అథ్లెట్ ఆట గురించి చర్చించాలి. అంతే కానీ.. ఇలా అందంపై చర్చ చేయడం అంటే వాళ్లను అవమానించడమే అని బాధపడింది.

# వడ్డీ రేట్లపై ఆర్‌బీఐ కీలక నిర్ణయం

**ముంబై :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న రెపోరేట్ల నిర్ణయంతో రుణ గ్రహీతలు బేజారయ్యారు. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేడు మానిటరీ పాలసీ కమిటీ సమావేశాల అనంతరం కీలక ప్రకటన చేశారు. అందులో భాగంగా రెపోరేట్లను 6.50 శాతం వద్ద స్థిరంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు.పూర్తి వివరాల్లోకి వెళితే ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేడు ఎంపీసీ సమావేశాల అనంతరం కమిటీ నిర్ణయాలను గురువారం ప్రకటించారు. ఎంపీసీ రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ద్రవ్యోల్బణం 5 శాతం కంటే ఎక్కువగా ఉన్నందున, రెపో రేటును మార్చకూడదని ఎంపీసీలోని సభ్యుల్లో 4:2 మెజారిటీ మంది నిర్ణయించారని దాస్ చెప్పారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతం దిగువకు తీసుకురావడమే మా లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉందని, ఆహార ఉత్పత్తుల ధరల కారణంగా జూన్‌లో ద్రవ్యోల్బణం 5.1 శాతానికి తగ్గిందని ఆయన అన్నారు. ధరల స్థిరత్వం లేకుండా, వృద్ధి దీర్ఘకాలం కొనసాగదని ఆయన అభిప్రాయ




పడ్డారు. మూడో త్రైమాసికంలో దేశంలో ద్రవ్యోల్బణం తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. దేశీయ స్థాయిలో వృద్ధి కొనసాగిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధి రేటు అంచనాను 7.2 శాతంగా ఉంచింది. అదే సమయంలో, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం రేటు అంచనా 4.5 శాతంగా నిర్ణయించారు. బ్యాంకింగ్ వ్యవస్థలో ఎక్కువ డబ్బు అందుబాటులోకి రావాలి. మరిన్ని ఉద్యోగాలు సృష్టించవలసి వచ్చినప్పుడు ద్రవ్య విధానం వైఖరి అనుకూలమైనదిగా ఉంచబడుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతోందని గవర్నర్ అన్నారు. అయితే, మధ్య కాలంలో కొన్ని సవాళ్లు మిగిలి ఉన్నాయి. పెరుగుతున్న డిమాండ్ కారణంగా, దేశంలో తయారీ రంగం కార్యకలాపాలు పెరుగుతున్నాయన్నారను. ఆర్‌బిఐ చివరిసారిగా రెపో రేటు ను ఫిబ్రవరి 2023లో సవరించిం ది. అప్పట్లో రెపో రేటును 6.5 శాతానికి పెంచారు. ద్రవ్యో ల్బణాన్ని నియంత్రించడమే లక్ష్యంగా ఆర్బీఐ రెపోరేటును అప్పట్లో సవరించింది. ఇదిలా ఉంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపోరేట్లను స్థిరంగా ఉంచడంతో బ్యాంకుల్లో రుణాల కోసం ఎదురుచూస్తున్న కస్టమర్లు నిరాశలో కూరు కు పోతున్నారు. రెపోరేట్లు తగ్గినట్లయితే, పాము పొందే రుణాలపై వడ్డీ కూడా తగ్గుతుందని భావించారు. వారి ఆశలపై నిజరూ బ్యాంక్ ఆఫ్ ఇండియా నీళ్లు చల్లింది.




## యూపీఐ పేమెంట్స్ వాడేవారికి
# గుడ్ న్యూస్

**ముంబై :** ప్రస్తుతం యూపీఐ పేమెం ట్స్ భారీగా పెరిగాయి. దేశంలో డిజిటల్ చెల్లింపులకు రోజురోజుకీ డిమాండ్ పెరుగుతోంది. చిన్న చిన్న మొత్తాలు మొదలు పెద్ద అమౌంట్స్ వరకూ యూపీఐ పేమెంట్ విధానాన్నే ఉపయోగిస్తున్నారు. దీంతో యూపీఐ చెల్లింపుల విషయంలో తాజాగా గవర్నర్ శక్తికాంత దాస్ కీలక ప్రకటన చేశారు. యూపీఐ ట్రాన్సాక్షన్స్ విషయంలో ముఖ్యమైన ప్రతిపాదనలు చేపట్టినట్లు వెల్లడించారు. గురువారం ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన నిర్ణయాల వెల్లడి సందర్భంగా గవర్నర్ శక్తికాంత దాస్ ఈ విషయమై కీలక ప్రకటన చేశారు. యూపీఐ ద్వారా ట్యాక్స్ చెల్లించే వారికి శుభవార్త తెలిపారు. యూపీఐ ద్వారా చేసే పన్ను చెల్లింపుల పరిమితిని పెంచనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న రూ.1 లక్షను రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. ఫలితంగా వ్యక్తిగత ఆదాయపు పన్ను, ఆస్తి పన్ను, ముందస్తు పన్ను చెల్లింపులు చేసేవారు ఒక లావాదేవీలో రూ.5లక్షల వరకు చెల్లించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఇప్పటివరకు రూ.లక్షకు మించి పన్ను చెల్లించాల్సిన వారు క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను ఉపయోగించే వారు. లేదా బ్యాంకుకు వెళ్లి పే చేసేవారు. దీంతో ఓటీపీ వివరాలు అందించడం, కార్డు వివరాలను ఎంటర్ చేయాల్సి ఉండేది. అయితే.. యూపీఐ చెల్లింపుల వల్ల అలాంటి ఇబ్బందులేవీ ఉండవు. కేవలం పిన్ ఎంటర్ చేసి ట్యాక్స్ పే చేసే అవకాశం లభిస్తుంది. 2023 డిసెంబరులోనే వైద్య ఖర్చులు, విద్యా సంస్థల్లో ఫీజులను యూపీఐ ద్వారా రూ.5 లక్షల వరకు చెల్లించే అవకాశాన్ని కల్పించింది. అంతకుముందు క్యాపిటల్ మార్కెట్లు, బీమా, విదేశాల నుంచి వచ్చే రెమిటెన్స్‌ల చెల్లింపుల పరిమితిని సైతం రూ.2 లక్షలు చేసింది. మరోవైపు ఐపీఓల్లో పెట్టుబడి, రిటైల్ డైరెక్ట్ స్కీముల్లోనూ ఒక్క లావాదేవీకి యూపీఐ రూ.5 లక్షల వరకు చెల్లించే అవకాశం ఉంది.

# మహీంద్రా క్లాసిక్ లెజెండ్స్ 15న ఆవిష్కరణ

**ముంబై :** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం 'మహీంద్రా అండ్ మహీంద్రా తాజాగా మోటారు సైకిల్ ను దేశీయ మార్కెట్లోకి తీసుకొస్తోంది. బర్మింగ్ హాం స్మాల్ ఆర్మ్స్ (బీఎస్ఏ) బ్రాండ్ మద్దతుతో క్లాసిక్ లెజెండ్స్, వింటేజ్ మోటారు సైకిల్స్‌లతో భాగస్వామ్య ఒప్పందం కల మహీంద్రా అండ్ మహీంద్రా ఈ మోటారు సైకిల్ తీసుకొస్తున్నది. ఇందులో మహీంద్రా అండ్ మహీంద్రాకు 60 శాతం వాటా ఉంది. 'బీఎస్ఏ గోల్డ్ స్టార్ 650' పేరుతో వస్తున్న ఈ మోటార్ సైకిల్ ఈ నెల 15న దేశీయ మార్కెట్లో ఆవిష్కరిస్తారు. ఇప్పటికే ఇంటర్నేషనల్ మార్కెట్లో సేల్స్ జరుగుతున్నాయి. క్రోమ్ అసెట్స్, రౌండ్ హెడ్ ల్యాంప్, టియర్ డ్రాప్ షేప్డ్ ఫ్యుయల్ ట్యాంక్, ఫ్లాట్ సీట్, వైర్ స్పోక్డ్ వెహికల్స్, ఇంప్రూవ్డ్ పెర్ఫార్మెన్స్ అండ్ హ్యాండ్లింగ్ కోసం మోడ్రన్ ఫీచర్లు జత చేశారు. ట్యూబులర్ స్టీల్ డ్యుయల్ క్రెడిల్ ఫ్రేమ్‌తో వస్తున్న మహీంద్రా బీఎస్ఏ గోల్డ్ స్టార్ 650 మోటారు సైకిల్ అప్ ఫ్రంట్ 41ఎంఎం టెలిస్కోపిక్ ఫోర్క్స్, అడ్జస్టబుల్ ప్రీలోడ్‌తో రేర్‌లో ట్విన్ గ్యాస్ చార్జ్ షాక్స్, ఫ్రంట్‌లో 320 ఎంఎం డిస్క్ బ్రేక్స్, రేర్‌లో 255 ఎంఎం డిస్క్ బ్రేక్స్ ఉంటాయి. బ్రెంబో కాలిపర్స్, డ్యుయల్ చానెల్ ఏబీఎస్, వంటి ఫీచర్లు ఉంటాయి. అంతే కాదు.. ఈ మోటారు సైకిల్ ఫ్యుయల్ ట్యాంక్ 12 లీటర్ల కెపాసిటీ కలిగి ఉంటుంది. మహీంద్రా బీఎస్ఏ గోల్డ్ స్టార్ 650 మోటారు సైకిల్ లిక్విడ్ కూల్డ్, సింగిల్ సిలిండర్, 652 సీసీ ఇంజిన్ తో వస్తుంది. ఎఫిషియెంట్ కంబుస్టన్ కోసం డీఓహెచ్సీ లేఔట్ విత్ ఫోర్ వాల్వ్స్, ట్విన్ స్పార్క్ ప్లగ్స్ జత చేశారు. ఈ ఇంజిన్ గరిష్టంగా 45 బీహెచ్పీ విద్యుత్, 55 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. క్లచ్ ఎఫర్ట్ తగ్గింపు, స్మూత్‌గా గేర్ మార్పిడి కోసం '5-స్పీడ్ గేర్ బాక్స్ విత్ ఏ స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్' ఉంటుంది.



Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657